మంచిమాట

కూరలో కారం ఎక్కువైతే తినడానికీ మాటలో వెటకారం ఎక్కువైతే వినడానికీ కష్టంగా ఉంటుంది.

TS-11-0036701

# నేటి చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 35 ఆదివారం, అక్టోబర్ 04, 2026 , పేజీలు - 12 వెల : 2/-




# న్యాయాన్ని కేవలం వృత్తిగా చూడొద్దు

పేదలు, బలహీనులకు న్యాయం అందేలా న్యాయ సేవా సంస్థలు పనిచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

పిల్లల సైబర్ భద్రత, ఆన్‌లైన్ వేధింపుల నివారణపై హైదరాబాద్‌లో నల్సా దక్షిణాది ప్రాంతీయ సదస్సు

**హైదారాబాద్,అక్టోబర్ 3 :** న్యాయాన్ని కేవలం వృత్తిగా చూడకుండా సమాజానికి సేవ చేసే బాధ్యతగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ న్యాయవాదిగా పనిచేస్తూనే పేదలు, బలహీనుల కోసం న్యాయాన్ని ఒక సాధనంగా ఉపయోగించారని గుర్తు చేశారు. డబ్బు లేకపోవడం వల్ల ఏ ఒక్కరికీ న్యాయం దూరం కాకూడదని పేర్కొన్నారు.జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం, ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం' అనే అంశాలపై హైదరాబాద్‌లో రెండు రోజుల దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల సైబర్ భద్రత అత్యంత కీలకమైన అంశమని అన్నారు.ప్రస్తుతం పిల్లలు ఎక్కువ సమయం అంతర్జాలంలో గడుపుతున్నారని, అయితే వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలు చాలా మంది తల్లిదండ్రులకు తెలియడం లేదని సీఎం పేర్కొన్నారు. ఇంటర్నెట్, కృత్రిమ మేధ వంటి సాంకేతికతలు జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలు విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. మిగతా2లో...

# ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

● అంతా బాగుందనుకుంటే ప్రమాదమే ● ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి ● ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి ● ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు ● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా


2లో

## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే...

ఈవీఎంల పార్తిగా దుర్వినియోగం జరిగింది

లోక్‌సభ, అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

మోదీ, అమిత్ షా అక్రమంగా పదవుల్లో ఉన్నారు

కేంద్ర ప్రభుత్వంపై మల్లికార్జున ఖర్గే ఆరోపణలు


2లో


2లో

## సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు

**హైదారాబాద్,అక్టోబర్ 3 :** హైదరాబాద్ భవానీనగర్ పోలీస్ స్టేషన్లో కస్టడీ వేధింపులపై తగిన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న ఇచ్చిన ఆదేశా లను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ షానవాజ్ ఆలం హైకో ర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీదేవి విచారణ

మిగతా2లో...

# మువ్వన్నెల రెపరెపలు

● 21 స్వర్ణాలు సహా 85 పతకాలు ● 4వ స్థానంలో నిలిచిన భారత్ ● చివరిరోజూ భారత్ పథకాల పంట ● హాకీలోనూ 'డబుల్ గోల్డ్' కైవశం ● పురుషుల స్వర్ణం కూడా కైవసం ● ఫైనల్‌లో మలేషియాపై విజయం ● ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు



**నగోయా, అక్టోబర్ 3 :** 2026 ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. క్రీడల చివరి రోజున ఐదు స్వర్ణ పతకాలు సాధించిన భారత్ మొత్తం 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో 85 పతకాలు సాధించి పతకాల పట్టికలో

మిగతా2లో...

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

● చివరి నిమిషంలో రద్దు.. పర్యటనకు కారణాలు అధికారికంగా వెల్లడి కాలేదు


2లో

# ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

● 18వరకు అత్యంత వైభవంగా నిర్వహణ

● రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ సంజయ్ జాజు వెల్లడి

● బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



**హైదారాబాద్,అక్టోబర్ 3 :** తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల మిగతా2లో...



## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

ఆస్పత్రులలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి

సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలి

అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

ప్రతివారం పురోగతిపై సమీక్ష నిర్వహించాలి

విద్య, వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సౌకర్యల కల్పనపై అధికారులకు సీఎం దిశానిర్దేశం

**హైదారాబాద్, అక్టోబర్ 3 :** రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు,

మిగతా2లో...



## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

- కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు
- ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

**హైదారాబాద్,అక్టోబర్ 3 :**రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికే రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల

మిగతా2లో...

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం..

మెట్రో - ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

మెట్రో, ఆర్టీసీలో ప్రయాణించిన భట్టి, పొన్నం

బస్సులోనూ ప్రయాణికులతో భట్టి ముచ్చట

ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం



**హైదారాబాద్,అక్టోబర్ 3 :** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మిగతా2లో...

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతు న్నాయా ప్రయాణం సులభమైందా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకు న్నారు. ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు.

# న్యాయాన్ని కేవలం వృత్తిగా చూడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చిన్నపాటి పొరపాట్లు కూడా పిల్లలతో పాటు వారి కుటుంబాలపై, సమాజంపై ప్రభావం చూపవచ్చని అన్నారు. పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి, వారిని ఆన్‌లైన్ ముప్పుల నుంచి ఎలా రక్షించాలి, బాధిత పిల్లలకు సకాలంలో న్యాయం ఎలా అందించాలనే అంశాలపై సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, బాలల సంరక్షణ విభాగాలు, బాలల సంక్షేమ కమిటీలు, ప్రత్యేక న్యాయస్థానాలు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే పిల్లలకు పూర్తి రక్షణ కల్పించగలమని తెలిపారు. మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, సలహా సేవలు అందించేలా భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని సీఎం వివరించారు. దేశంలోనే తొలి బాలల అనుకూల న్యాయస్థానాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసు శాఖలోని మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో సైబర్ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయని, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా బాలల సంరక్షణ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు సీఎం వెల్లడించారు. బాధిత పిల్లలకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం వంటి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. పిల్లల చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం మాత్రమే కాదని, బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, అతనికి గౌరవాన్ని పునరుద్ధరించడం కూడా న్యాయంలో భాగమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా బాలల విషయంలో వారు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించేలా వ్యవస్థ పనిచేయాలని పేర్కొన్నారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవా సంస్థతో కలిసి సమగ్ర భద్రతా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. **తీర్పుతో న్యాయం ముగియదు** కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి రామ్‌మేఘవాల్ మాట్లాడుతూ న్యాయం కోసం సాగే ప్రయాణం కేవలం తీర్పుతో ముగిసిపోదని అన్నారు. బాధిత బాలలకు సలహా సేవలు, అవసరమైన వైద్యం, విద్య కొనసాగింపు, పరిహారం, సురక్షిత పునరావాసం అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. 2024 నుంచి అమల్లో ఉన్న పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం ప్రాధాన్యాన్ని వివరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, న్యాయ సేవా సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సంచార లోక్ అదాలత్ వాహనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

# ముమ్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 3 :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపు తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయి నా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిం దన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు.

దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరిం చడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పా రు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతు న్నాయని తెలిపారు.

ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

# దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే...

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 :**కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు.

"ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు.

# ముువ్వన్నెల రెపరెపలు

(మొదటి పేజీ తరువాయి)

నాలుగో స్థానంలో నిలిచింది. క్రికెట్‌లో పాకిస్థాన్‌పై భారత్ 19 పరుగుల తేడాతో విజయం సాధించి వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని అందుకుంది. హాకీలోనూ పురుషుల జట్టు మలేషియాపై 5-1తో గెలిచి పసిడి పతకం సాధించింది. దీంతో 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత పొందింది. ఆర్చరీలో కుమ్‌కుమ్ మొహోద్ మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించగా, రెజ్లింగ్‌లో అమన్ షెరావత్ 57 కేజీల విభాగంలో పసిడి పతకం గెలుచుకున్నాడు. గోల్ఫ్‌లో ప్రణవి శరత్ మహిళల వ్యక్తిగత విభాగంలో భారత్‌కు చారిత్రక స్వర్ణాన్ని అందించింది. మహిళల గోల్ఫ్ జట్టు విభాగంలో భారత్ రజత పతకం సాధించింది. మొత్తం 495 మంది భారత క్రీడాకారులు 36 క్రీడాంశాల్లో పోటీపడ్డారు. 14 రోజుల పాటు సాగిన ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు సాధించిన పతకాలు దేశ క్రీడా ప్రతిభను చాటాయి.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

**హైదరాబాద్,అక్టోబర్ 3 :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. ఒక రోజు పర్యటనలో భాగంగా ఆదివారం రాష్ట్రానికి రావాల్సి ఉండగా కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. అయితే పర్యటన రద్దుకు గల కారణాలను అధికారికంగా వెల్లడించలేదు. షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. అమిత్ షా పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే అనూహ్యంగా పర్యటన రద్దు కావడంతో కారణాలపై స్పష్టత లేకుండా పోయింది. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ పర్యటనను అమిత్ షా ఎప్పుడు చేపడతారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

# ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు.

# సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి క్రిమి నల్ కేసులు లేకపోయినా పిటిషనర్ను ఆగస్టు 6న పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారన్నారు. దీనిపై కమిషనర్ తో సహా అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన కోర్టు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఒకవేళ ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న కమిషనర్ ను ఆదేశించినా చర్యలు తీసుకో లేదన్నారు. అందువల్ల కమిషనర్పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రతివాది అయిన పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనారు నోటీసులు జారీ చేస్తూ విచారణను నవంబరు 6కు వాయిదా వేశారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం కారణాలు చెబుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రైతులు విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం ప్రజల్లో మార్పు సంకేతమని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

# హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా: ఉత్తమ్




**హైదరాబాద్,అక్టోబర్ 3 :** వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తుంగతుర్తి నుంచి పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనకు హుజూర్‌నగర్‌తో ఉన్న అనుబంధం కొనసాగుతుందని, రాబోయే ఎన్నికల్లోనూ అక్కడి నుంచే బరిలో ఉంటానని తెలిపారు. తుంగతుర్తిలోని తన స్వగ్రామం తాటిపాముల అభివృద్ధి పనులపై కూడా మంత్రి వివరించారు.

# అక్టోబర్ 5న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

**ఆదివాసీల హక్కులు, పెండింగ్ జీఓల అమలుకు మహాధర్నా, ఆదివాసీ సంఘాల ఐక్యచరణ కమిటీ పిలుపు.**





**చర్చ :- అశ్వారావుపేట.** ఆదివాసీల హక్కుల సాధన, పెండింగ్‌లో ఉన్న జీఓల అమలు, ఐదో షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణ, ఆదివాసీల జాతి అస్తిత్వం కోసం అక్టోబర్ 5న కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నా, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యచరణ కమిటీ పిలుపునిచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు గ్రామ గ్రామం నుంచి స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కోరారు. మహాధర్నాపై గత వారం రోజులుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ గ్రామ పెద్దలు, సర్పంచులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ రాజకీయ ప్రతినిధులను కలిసి మద్దతు కోరినట్లు తెలిపారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, ఐదో షెడ్యూల్ ప్రాంతాల సంరక్షణతో పాటు పెండింగ్ జీఓల అమలు కోసం నిర్వహిస్తున్న ఈ మహాధర్నాకు ఆదివాసీ సమాజం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు కొర్సా వెంకటేష్ దొర, తెల్లం రామారావు దొర, కుంజా చిన్నబాబు, పాశం ప్రసాద్, కొర్సా వీదరాజు, తాటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు ముమ్మరం

**అధికారులు, క్రీడా కమిటీలతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమీక్ష**





**చర్చ:- అశ్వారావుపేట.** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, క్రీడా కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. క్రీడాకారులకు వసతి, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయా లు, భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను ఎమ్మెల్యే సమీక్షించారు. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, నిర్వాహకులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా ప్రాంతానికి క్రీడా రంగంలో మరింత గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారు లను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, నిర్వాహకులు, క్రీడా కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల కోసం వైద్య సిబ్బంది, ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మెన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూపల్లి రమేష్ బాబు, జిల్లా జనరల్ సెక్రెటరీ కోలా లక్ష్మీనారాయణ, తుమ్మా రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల అధికారులు, క్రీడా కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగిపై అర్ధరాత్రి దాడి అమానుషం

**విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాంజీ**



**జగిత్యాల, అక్టోబర్ 3:** సారంగాపూర్ సెక్షన్ పరిధిలోని సారంగాపూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎల్ఎంఒ ఫణి చంద్రశేఖర్‌పై రాత్రి 11.30 గంటల సమయంలో జరిగిన దాడిని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం అమానుషమని, ఇలాంటి ఘటనలు ఉద్యోగుల భద్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, 327 విద్యుత్ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా కార్యదర్శి నూనావత్ రాంజీ నాయక్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతర విద్యుత్ సేవలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న విద్యుత్ ఉద్యోగులపై దాడులకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఫణి చంద్రశేఖర్‌పై దాడికి పాల్పడిన వారిపై తగిన చర్యలు ఎతీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆత్మగౌరవం, భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.....

# పామాయిల్ గెలల అక్రమ తరలింపు కేసులో 9 మంది అరెస్ట్

**రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదు స్వాధీనం మరో ఇద్దరు పరారీ**

**చర్చ :- దమ్మపేట.** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న ముఠాపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి, రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన దర్యాప్తులో పామాయిల్ గెలల అక్రమ తరలింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లారీలు, ట్రాక్టర్ల ద్వారా పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలకు తరలించే సమయంలో యజమానులకు తెలియకుండా కొంత మొత్తంలో గెలలను మార్గమధ్యంలో దించి, అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

గత నాలుగు నెలలుగా బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ



డ్రైవర్ బత్తిన రాము, ట్రాక్టర్ డ్రైవర్లు గడ్డం మహేంద్ర, కీసరి నాగరాజు, నాగబాబు తదితరులు వివిధ గ్రామాల నుంచి అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు గెలలను తరలించే క్రమంలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అలాగే కనితి లక్ష్మీనారాయణ అక్రమంగా సేకరించిన పామాయిల్ గెలలను కనితి శివ, వంక చందు తమ ఆటోల ద్వారా తరలించడంలో సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పొట్ట ముత్యాలరావుతో పాటు మరికొందరి ప్రమేయంపైనా దర్యాప్తు చేపట్టారు. జక్కా బాలు, కారం వెంకటేష్, చి. పుల్లారావు తమ ఎఫ్-కోడ్లను ఉపయోగించి పామాయిల్ గెలల విక్రయాలకు సహకరించడంతో పాటు నగదు లావాదేవీల్లో భాగస్వాములైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో నిందితులు పరస్పర సమన్వయంతో పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు.

పామాయిల్ గెలల దొంగతనం, అక్రమ రవాణా, ఎఫ్-కోడ్ల దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తులో అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, దమ్మపేట ఎస్ఐ బాలస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్ళకు గంతలు కట్టుకున్న ఎక్సైజ్ శాఖ

**మూడు పువ్వులు ఆరు కాయలు గా సాగుతున్న బెల్ట్ వ్యాపారం.**
**ఎక్సైజ్ శాఖకు ఏమైంది అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో గ్రామాగ్రామాన బెల్ట్ షాపుల జోరు.**
**మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ మత్తులో చిత్తవుతున్న సగటు మనిషి జీవితం.**
**ఎక్సైజ్ శాఖా నువ్వెక్కడ ఆ శాఖను పాలిస్తున్న ఆ వైట్ కాలర్ ఎవ్వరు**
**అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో విస్తృతంగా విస్తరించిన బెల్టు షాపులు గుడి లేదు బడి లేదు ఎక్కడైనా పెట్టేస్తాం మమ్మల్ని ఆపేదేవరు.**
**కూలీల కష్టాన్ని దోచుకుంటున్న బెల్ట్ నిర్వాహకులు : ఎక్సైజ్ శాఖ 'కళ్లెదుటే' నిలువుదోపిడీ!**




**చర్చ :- అశ్వారావుపేట.** అశ్వారావుపేట నియోజకవర్గంలో చట్టం తన పని తాను చేసుకోవడం మానేసి చాలా కాలమైంది. నిబంధనలు, ఆంక్షలు, ప్రభుత్వ ఆదేశాలు అన్నీ కేవలం కాగితాలకే పరిమితమైపోగా, అక్రమ బెల్ట్ షాపు నిర్వాహకుల ఇష్టారాజ్యమే ఇక్కడ ఏకైక రాజ్యాంగంగా చెల్లుబాటవుతోంది. ప్రతి వీధి చివర, బస్టాండ్ ఆవరణకు, పాఠశాలలకు, దేవాలయాలకు సమీపంలో మరియు నివాస ప్రాంతాల నడుమ పుట్టగొడుగుల్లా వెలిసిన అక్రమ మద్యం దుకాణాలు పగలు, రాత్రి తేడా లేకుండా 24/7 గంటల పాటు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిర్ణీత ఎంఆర్పి ధరలకు ఏకోశానా విలువ లేకుండా పోయింది. ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై 30 నుంచి 50 రూపాయలు, ఫుల్ బాటిల్‌పై 100 నుంచి 150 రూపాయల వరకు అదనంగా వసూళ్లు చేస్తూ సామాన్యుడి జేబులకు నిలువునా కన్నం వేస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటితే చాలు, ఈ దోపిడీ మరీ దారుణంగా మారి ఆకాశాన్ని తాకుతోంది. అర్ధరాత్రి దాటినా, తెల్లవారుజామున 4 గంటలకైనా అక్రమ మద్యం దుకాణాల్లో సులభంగా లభిస్తోంది. తాగే మైకంలో ఉన్న మందుబాబులను ఆసరాగా చేసుకుని బెల్ట్ షాపు యజమానులు సాగిస్తున్న ఈ దందాపై సర్వత్రా తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

అసలు ఈ నియోజకవర్గంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉందా లేదా అన్న తీవ్రమైన అనుమానాలు స్థానిక ప్రజల్లో బలపడుతున్నాయి. నిత్యం పత్రికల్లో, చానళ్లలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్నటువంటి బెల్ట్ షాపుల అరాచకంపై వరుస కథనాలు వస్తున్నా, ఎక్సైజ్ అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని నిద్ర నటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగడానికి మంచి నీరు దొరకడానికైనా సమయం పడుతుందేమో కానీ, మద్యం మాత్రం ఏ క్షణానైనా, ఏ మూలనైనా సులభంగా లభించడం ఎక్సైజ్ అధికారుల ఘోర వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం. ప్రతి నెలా లక్షల రూపాయల మామూళ్లు అధికారుల చేతులకు ముట్టుతుండటం వల్లే వారు ఈ అక్రమ సామ్రాజ్యాన్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ప్రజల నుంచి బహిరంగంగానే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్సైజ్ అధికారుల ఈ మౌనం వెనుక భారీ స్థాయిలో లంచాల పర్వం నడుస్తోందని, మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు తమ బాధ్యతలను, జవాబుదారీతనాన్ని పూర్తిగా విస్మరించి నిద్రపోతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఈ అక్రమ మద్యం ప్రవాహం వల్ల మండల పరిధిలోని పల్లెల్లో ప్రశాంతత పూర్తిగా కరువైంది. రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే పేద కూలీలు సంపాదించిన కష్టార్జితమంతా ఈ బెల్ట్ షాపుల పాలవుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా తాగి వీధుల్లో ఊగుతున్న మందుబాబుల బూతు పురాణాలు, భౌతిక గొడవలతో స్థానిక మహిళలు, వృద్ధులు, చిన్నారులు నిత్యం తీవ్ర భయాందోళనల మధ్య గడుపుతున్నారు. గొడవలను అడ్డుకోబోయిన వారిపై దాడులకు తెగబడుతుండటంతో ప్రతిరోజూ ఏదో ఒక ఇంట్లో పంచాయితీలు నిత్యకృత్యమయ్యాయి. మండలాల్లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి, కంటిమీద కునుకు లేకుండా కాపురాలు కూలిపోతుంటే ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాత్రం తమ ఏసి ఆఫీసులకే పరిమితమై కాలక్షేపం చేస్తున్నారు. "మా కుటుంబాలు రోడ్డున పడుతున్నా పట్టించుకోని ఈ ఎక్సైజ్ అధికారులకు, అక్రమంగా కోట్లు అర్జించే బెల్ట్ షాపు యాజమాన్యానికి ఎలాంటి కఠిన శిక్ష విధించినా తప్పులేదు" అని స్థానిక మహిళలు కన్నీటిపర్యంతమవుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ అక్రమ మద్యం వ్యాపారం వెనుక కేవలం ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యమే కాకుండా, స్థానిక రాజకీయ నాయకుల కుట్రలు, అభయహస్తం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ పెద్దల అండదండలు పుష్కలంగా ఉండటం వల్లే బెల్ట్ షాపు నిర్వాహకులు చట్టాన్ని, పోలీసులను, ఎక్సైజ్ వ్యవస్థను అస్సలు లెక్కచేయకుండా యథేచ్ఛగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటానికి కూడా భయపడుతున్నారంటే రాజకీయ ఒత్తిళ్లు ఎంత దారుణమైన స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రోజువారీ వార్తల్లో, మీడియాలో కథనాలు వస్తున్నా స్పందించని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి అశ్వారావుపేట నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు బెల్ట్ వ్యాపారాంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తక్షణమే ఉన్నత స్థాయి ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, మండలంలోని ప్రతి బెల్ట్ షాపును సీజ్ చేయాలి. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై, వారికి లోపాయికారీగా సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై కఠినమైన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని, అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ప్రశాంతతను పునరుద్ధరించాలని మహిళా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జోరుగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

**గ్రామ గ్రామానికీ చేరుతున్న నమోదు ప్రచారం.. అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని పిలుపు.**

**చర్చ :- అశ్వారావుపేట** మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు కాసాని చంద్రమోహన్, డాక్టర్ భూక్య ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన, ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. ఫారం-18 ద్వారా దరఖాస్తులు పూర్తి చేయించడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు





చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని ఊట్లపల్లి, వేదాంతపురం, కేశప్పగూడెం, జమ్మిగూడెం గ్రామ పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఊట్లపల్లి నుంచి తెలగారెడ్డి గంగాభవాని--బ్రహ్మాజీ, కోడూరు నాగు, కటుకూరి వెంకటేశ్వరరావు, ప్రభాకర్, బండారి సుబ్బారావు, ఎపుగంటి వీరబాబు, తెల్లం హరిబాబు, గడ్డం పాండు, ఎపుగంటి లలితాదేవి, లక్ష్మీనారాయణ; జమ్మిగూడెం నుంచి మిద్దెన కొండయ్య, జగపతి, మిద్దెన వెంకటేశ్వరరావు, సూరిబాబు కేశప్పగూడెం నుంచి సర్పంచ్ బెతి భారతి--రాంబాబు, ముత్యాలరావు, బెతి పుల్లారావు; వేదాంతపురం నుంచి తోట వెంకటస్వామి, మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే అశ్వారావుపేటకు చెందిన బీఆర్ఎస్ మాజీ టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, జుజ్జురపు శ్రీరామమూర్తి, మోహన్, నవీన్, రాంజీ, జక్కం బలరాం, రవి తదితరులు పాల్గొని పట్టభద్రులు సకాలంలో తమ ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గండుగులపల్లిలో ప్రత్యేక గ్రామసభ.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**వంటశాల, డైనింగ్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.**








**చర్చ :- దమ్మపేట.** దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించడంతో పాటు అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. వి.బి.జి.రామ్‌జీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై అధికారులు, ప్రజలతో చర్చించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం గండుగులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు పూర్తికావడంతో వాటిని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఘాట్‌రోడ్డులో బస్సు బోల్తా - ముగ్గురు మృతి, 51 మందికి గాయాలు

**వికారాబాద్ జిల్లా :**అనంతగిరి ఘాట్‌రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ట్రావెల్స్? బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మరో 51 మందికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్సులు, వాహనాల్లో సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ట్రావెల్స్ బస్సులో 54 మంది ప్రయాణికులు ఉన్నారు. మెరుగైన వైద్యానికి సీఎం ఆదేశాలుపటాన్‌చెరు నుంచి వికారాబాద్ జిల్లా చింతకుంట వెళుండగా ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు




తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.సహాయక చర్యల్లో పాల్గొనాలిబస్సు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం, పలువురు గాయపడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.క్షతగాత్రులను వెంటనే రక్షించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకత్వానికి పిలుపునిచ్చారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి అవసరమైన సహాయం అందేలా స్థానిక నాయకులు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. ‘వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో బస్సు లోయలో పడిపోయిన ఘటన తీవ్రంగా కలచివేసింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం, పలువురు గాయపడటం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.”

# రాజ్యాంగ పరిరక్షణ చైతన్య సదస్సు




**చర్చ :-** హుస్నాబాద్: రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం రాజ్యాంగాన్ని రక్షించుకోవడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు నియోజకవర్గస్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ చైతన్య సదస్సు నిర్వహించాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం తీర్మానించింది. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన సమావేశంలో రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశాలతో పాటు ఎస్ఐఆర్, అంశంపై చర్చించారు నియోజకవర్గంలోని ఏడు మండలాలలో రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా హుస్నాబాద్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ సిద్ధారి పద్మ, కౌన్సిలర్లు గాదపాక రవీందర్. చావుల మంజుల బత్తుల స్వరూప. జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి. కో - కన్వీనర్ మేకల వీరన్న యాదవ్, జేఏసీ నాయకులు దేగల. సారయ్య ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్. మార్క అనిల్. వేముల జగదీష్. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్ బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్. పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పురోగతి - మరో ఏడుగురు నిందితుల అరెస్ట్

**బొల్లారం:** సంచలనంగా మారిన బొల్లారం ఆయుధాల చోరీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఆయుధాల చోరీ కేసులో మరో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో ఈ కేసు లోని ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన పలు విషయాలను మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. మల్లేశ్ ఇచ్చిన వివరాలతోఈ కేసులో ప్రధాన నింది తుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో నిందితులు శేషు, వినోద్, ప్రవీణ్, నిరంజన్, మల్లికార్జున్, బీర్బల్ షా, అవి దెయ్‌ను అరెస్టు చేసినట్లు సీపీ సుమతి స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల వివరాలను కోర్టులో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. నిందితుడు మల్లేశ్ ఒకేసారి ధనవంతుడు కావాలని ఈ నేరానికి పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడు గతంలో కూడా చాలా దొంగతనాలకు పాల్పడ్డాడని అన్నారు. తన స్నేహితులతో కలిసి మల్లేశ్ ఆయుధాల చోరీకి పాల్పడ్డాడని వివరించారు.దోపిడీలకు వాడాలని కుట్రఏ2 శేషు, ఏ3 వినోద్, ఏ4 ప్రవీణ్? ఆర్మీలో పని



చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సీపీ సుమతి పేర్కొన్నారు. ఆయుధాలను బ్యాంకులు, జ్యువెల్లరీ షాపుల్లో చోరీలకు వాడాలనుకున్నారని వెల్లడించారు. ధనవంతులను బెదిరించి దోపిడీలకు వాడాలని కుట్ర చేసినట్లు తేలిందని తెలిపారు.ఉగ్రవాద లింకులు లేవని స్పష్టంఆయుధాలు కావాలని ఇద్దరు పశ్చిమ్ బెంగాల్ వాసులు సంప్రదించారని చెప్పారు. పిస్టల్‌కు రూ.3 లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షలకు ఒప్పందం జరిగిందని వెల్లడించారు. మల్లేశ్‌పై గతంలో అచ్చంపేట, అమ్రాబాద్ పీఎస్‌లలో చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయుధాల కేసులో ఉగ్రవాద లింకులు లేవని స్పష్టం చేశారు. ఆయుధాలతో చోరీలకు పాల్పడే ఉద్దేశంతోనే కుట్ర జరిగిందని వివరించారు.

# ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షుడు



**చర్చ:- అక్కన్నపేట్ :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం పోతారం (జె) గ్రామం. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా లింగాల స్వామి. కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్ గౌడ్. గ్రామ సర్పంచ్ వాసాల తిరుపతి. ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా లింగాల స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బోద రమేష్ రెడ్డి. ప్రధాన కార్యదర్శిగా షేక్ జైన్లావుద్దీన్, కార్యదర్శులుగా ధర్నా శ్రీనివాస్ సూరి కుంటి కృష్ణారెడ్డి కోశాధికారిగా వనం సంపత్, బీసీ సెల్ బంక మల్లయ్య, మైనార్టీ సెల్ ఎండి అజీమీయా ఎస్సీ సెల్ లింగాల ప్రసాద్ కిసాన్ సెల్ తరాల బాబు, మహిళా మెంబర్గా సయ్యద్ సఖి నాభి, కార్యవర్గ సభ్యులుగా వాసాల లింగయ్య సోషల్ మీడియా బండి రాజశేఖర్ లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస ఛార్జీలు పెరిగాయ్ - ఇకనైనా ఆటో అన్న ‘మీటరు’ వేసేనా

**హైదరాబాద్:** ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోలు, బైకులు, క్యాబ్?లలో సులభంగా ప్రయాణిస్తున్నాం. పైగా ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్‌లు అందుబాటులోకి రావడంతో ప్రయాణం మరింత సులభతరమైంది. అయితే గతంలో హైదరాబాద్‌లో ఒక చోట నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే ఆటోలనే ఆశ్రయించేవారు. ముందుగా మీటరా, లేదా మీటరు లేకుండానా అని డ్రైవర్‌తో ప్రయాణికులు మాట్లాడుకునే వారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంప్రదాయం పూర్తిగా కనుమరుగైపోయింది.ప్రధానంగా సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో ఆటోలు బుక్ చేసుకునేందుకు యాప్?లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో నేటి జెన్ ఆల్ఫా తరానికి ఆటో మీటర్ అంటే ఏమిటో కూడా తెలియడం లేదు. నేడు నగరంలో ఉన్న ఆటోల్లో దాదాపుగా ఇవి కనుమరుగయ్యాయి. ఇదిలా ఉండగా ఆటోల కనీస ఛార్జీలు పెంచుతూ రవాణా శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ మీటర్ల అంశం మరోసారి చర్చల్లోకి వచ్చింది. ప్రస్తుతం నగరవ్యాప్తంగా సుమారు 1.09 లక్షల ఆటోలు తిరుగుతున్నాయి.ఉన్నా పనిచేయవు, చేసినా వేయరునగరంలోని ఆటో ఛార్జీలు పెంచక సుమరు పుష్కర కాలం అవుతోందని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. మీటర్లు ఉన్నప్పటికీ అవి కేవలం అలంకారప్రాయంగా మార్చారని అంటున్నారు. చాలా వరకు నిర్దిష్ట దూరానికి తగిన ఛార్జీలు వసూళ్లు చేస్తున్నారు. యాప్?ల వినియోగం పెరగడంతో ప్రయాణికులకు కూడా మీటర్లు అవసరం అంతగా లేకపోయింది. నేడు వెళ్లాల్సిన దూరం యాప్?లో చూసుకొని ఆటో, క్యాబ్, బైక్‌ల ఛార్జీలు చూసుకొని




ఉత్తమమైన దానిని ఎంచుకొని బుక్ చేస్తున్నారు.పక్కాగా అమలు చేస్తేనే మేలుపెంచిన ఆటో ఛార్జీలపై ప్రయాణికులు స్పందిస్తున్నారు. పెంచిన ధరలను ఆటోవాలాలు ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారని చెబుతున్నారు. మరి కొన్ని చోట్లైతే సాధారణ ఛార్జీల కంటే ఎక్కువగానే వసూలు చేస్తున్నారని అంటున్నారు. అయితే మీటర్?ను పక్కాగా అమలు చేస్తే ప్రయాణికులకు మేలు కలుగుతుందని సూచిస్తున్నారు.“ప్రస్తుతం ఛార్జీలు ఓ కొలిక్కి వచ్చాయి. మరో మూడు నెలల్లో ఆటోలన్నీ డిజిటల్? మీటర్లు పెట్టుకోవాలి. దీనిపై విధి విధానాలను త్వరలో వెల్లడిస్తాం. ఫిట్‌నెస్‌కు ముందు తూనికల కొలతల అధికారులు పరిశీలించి మీటర్ లాక్ తీసి ఆటోకు బిగించి ధ్రువీకరిస్తారు. ఆ తర్వాతే ఫిట్‌నెస్ పూర్తవుతుంది” - వెంకటరమణ, జేటీసీ ప్రయాణికులూ సహకరించాలిదశాబ్ద కాలం తర్వాత ఆటో ఛార్జీలు పెరిగాయని ఆటో సంఘాల ఐకాస నేత సత్తిరెడ్డి పేర్కొన్నారు. దీనికి ప్రయాణికులు సహకరించాలని కోరారు. ఆటో డ్రైవర్లు సాధ్యమైనంత త్వరగా మీటర్లు బిగించుకునేలా చేస్తామన్నారు. యాప్ సేవలు వాడుకున్నా మీటర్లతో ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.ఆటో కనీస ఛార్జ్ రూ.30తెలంగాణలో ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు పన్నెండు సంవత్సరాల తర్వాత ఆటో ఛార్జీలు పెరిగాయి. 1.6 కి.మీ. వరకు ఆటో కనీస ఛార్జ్ రూ.30గా ఉండనుంది. కనీస ఛార్జ్ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. ప్రతి నిమిషానికి ఆటో డిటెన్షన్ ఛార్జీలు 75 పైసలుగా నిర్ణయించారు. అర్హత ఉన్న ప్రతి లగేజీ ప్యాకేజీకి ఛార్జీ రూ.25 పైసల నుంచి రూ.50 పైసలకు పెంచారు. మూడు నెలల్లోపు డిజిటల్ మీటర్ల ఏర్పాటుగరిష్ఠ లగేజీ పరిమితి 100 కిలోలుగానే కొనసాగించారు. రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. మూడు నెలల్లోపు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

# సంకపల్లిలోని 45 ఇండ్లకు పరిహారం ఎప్పుడు ఇస్తారు

**వేములవాడ:** వేములవాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సిరిసిల్లలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆది శ్రీనివాస్‌కు వాక్చాతుర్యం, మాట్లాడే ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్థాయిలో ఫలితాలు




కనిపించడం లేదని చల్మెడ విమర్శిం చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా ఇతర అంశాలను తెరపైకి తీసుకురావడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.చల్మెడ మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను ప్రస్తావిస్తూ.. గతంలో సంకపల్లి వంటి గ్రామాల్లో అప్పటి పిసిసి అధ్యక్షుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించిన సందర్భంగా నిర్వాసితులకు రూ.5.04 లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.మిడ్ మానేరు సమస్యలు 2005--06 కాలం నుంచే కొనసాగుతున్నాయి. 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొని ప్రాజెక్టును పూర్తి చేసింది. ఇప్పుడు మిగిలిన సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి అని చల్మెడ అన్నారు.

## ‘పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి’

**నల్గొండ రూరల్, అక్టోబర్ 03 :**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సైన్యం (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవన్న మాదిగ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నల్లగొండలోని తెలంగాణ మాదిగ సైన్యం జిల్లా కార్యాలయంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ




సమావేశంలో తెలంగాణ మాదిగ సైన్యం సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల కోసం అద్దె హాస్టల్ భవనాలపై ఆధారపడకుండా సొంత భవనాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొడతాల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి నక్కల సైదులు, జిల్లా అధ్యక్షుడు నరసింహ, టీఎంఎస్ నాయకులు పెదమం శివ, గిరి, చందు, మోహన్ పాల్గొన్నారు.

# తెలంగాణలో స్థానికత అంశం - మరోసారి స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్ :**తెలంగాణ స్థానికత విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత ఇచ్చింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిందేనని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ బెంచ్ ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తెలంగాణ స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న పిటిషనర్? వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్ష(నీట్)కు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదువుకుంటేనే స్థానికత వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం



చేసింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను మరోసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.అసలు కథ మొదలైంది ఇక్కడ : వైద్య విద్యలో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు స్వరాష్ట్రం తెలంగాణలో చదివి ఉండాలని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులను జారీ చేసింది. అప్పుడే కొంతమంది విద్యార్థులు ఈ అంశంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్? దాఖలు చేయగా, నిబంధనలను తప్పుబడుతూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.దీనిపై తెలంగాణ ప్రభుత్వం నేరుగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటిషన్? దాఖలు చేసింది. ఈ కేసు విచారణను చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌ల ధర్మాసనం అన్ని అంశాలను పరిగణించి కొద్ది రోజుల పాటు తీర్పును రిజర్వ్ చేసింది. ఆగస్టు 05న వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు తెలిపిన న్యాయస్థానం, ఇంకేమైనా వాదనలుంటే ఆగస్టు 8లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఇరు వర్గాలను ఆదేశించింది.ప్రభుత్వంపై సీజేఐ ఆగ్రహం : స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని జస్టిస్ గవాయ్ విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు ధర్మాసనంతో చెప్పారు.

## గ్రామకంఠాల మినహాయింపులపై చంద్రబాబు కీలక ఆదేశాలు



**అమరావతి, అక్టోబర్ 3:** ప్రభుత్వం అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో అమరావతి పరిధిలో భూముల సమీకరణను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంలో అమరావతి పరిధిలోని పలు గ్రామాలను, వాటిని ఆనుకుని ఉన్న పశువుల కొట్టాలను గ్రామకంఠాల కింద పరిగణించి.. భూసమీకరణ నుంచి మినహాయించారు. అయితే.. తమ భూములను కూడా గ్రామకంఠాల కింద పరిగణించి.. భూసమీకరణ నుంచి మినహాయించాలని కొందరు రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఆర్డీఏ రూపొందించిన నిబంధనలను అనుసరించి.. ప్రభుత్వం కొంతమంది రైతుల భూముల మినహాయింపునకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీఆర్డీఏ రూపొందించిన నిబంధనలకు విరుద్ధంగా రైతుల భూములను మినహాయింపు చేశారని కొన్ని గ్రామాల వారు మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. గ్రామకంఠాల మినహాయింపులలో జరిగిన అవకతవకలపై మంత్రి నారాయణ ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం.. చంద్రబాబు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమరావతి గ్రామకంఠాల మినహాయింపులను పునః పరిశీలించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మినహాయింపులు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా లేదా అన్న అంశాన్ని లోతుగా పరిశీలించి.. సీఆర్డీఏకు నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. బాయిలర్ పేలుడు.. ఐదుగురికి పైగా మృతి

**తిరుపతి, అక్టోబర్ 3:** జిల్లాలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. సత్యవేడు మండలం శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలినట్లు సమాచారం. నైట్ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి పలువురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. మొదట ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం అందగా.. ఆ తర్వాత మృతుల సంఖ్య నలుగురికి చేరినట్లు తెలుస్తోంది. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. ప్రమాదంపై




మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేలుడు జరిగిన వెంటనే అప్రమత్తమైన రెస్క్యూ బృందాలు.. సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. పరిశ్రమలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. మృతుల వివరాలు ఇవే.. పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 5కి చేరింది. గౌరబ్ రాయ్ (35), చిన్న మస్తాన్ (36), రమేష్ (40) మృతిచెందినట్లు అధికారులు గుర్తించారు. మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. తీవ్రంగా గాయపడిన వాసు (36) చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. పేలుడు ధాటికి పరిశ్రమ శకలాలు సుమారు 100 మీటర్ల దూరంలో పడిపోయాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో ఎంతమంది కార్మికులు విధుల్లో ఉన్నారు.. పేలుడుకు అసలు కారణం ఏమిటనే విషయాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. బాయిలర్‌లో సాంకేతిక లోపం కారణంగానే పేలుడు జరిగిందా.. మరేదైనా కారణం ఉందా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడయ్యే వరకు మృతులు, క్షతగాత్రుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది.

అండగా ఉంటుంది: మంత్రి లోకేశ్

శ్రీసిటీలోని ప్రైవేటు ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిన ఘటనపై మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## విజయనగరం జిల్లాలో వైసీపీకి మరో షాక్

**విజయనగరం, అక్టోబర్ 03:** వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రకటించారు. గౌరవం లేని చోట తాను, తన అనుచరులు ఉండలేమని ఆయన కుండబద్దలు కొట్టారు. శనివారం విజయనగరంలో విలేకర్లతో మాట్లాడుతూ బడ్డుకొండ అప్పలనాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓ నియంత అని అభివర్ణించారు. ఆ పార్టీ ఓ లిమిటెడ్ కంపెనీ అని వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక చర్యల వల్లే గత ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైందని తెలిపారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఓడిపోతారని జగన్ సంధి ప్రేలాపనలు చేసి.. వైసీపీని నాశనం చేశారని అన్నారు. వైసీపీలో క్రమశిక్షణ కమిటీ అంటూ ఒకటి వుందా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సొంత పార్టీ కాబట్టి మీ ఇష్టం వచ్చినట్టు చెలరేగుతున్నారంటూ వైసీపీ నేతలపై ఆయన



నిప్పులు చెరిగారు. జగన్‌ను నమ్ముకొని వేలాది కుటుంబాలు కూలిపోయాయని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న శ్రీను మా బావ కాబట్టి తనను కారణం లేకుండా సస్పెండ్ చేశారని విమర్శించారు. మరి చిన్న శ్రీనుకి బావ బొత్స సత్యనారాయణ అని తెలిపారు. మరి ఆయన్ని కూడా సస్పెండ్ చేయగలరా? అంటూ వైసీపీ అగ్రనేతలకు ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడు సవాల్ విసిరారు. మజ్జి శ్రీనుకు సమీప బంధువు.. నెల్లిమర్ల ఎమ్మెల్యేగా, విజయనగరం జడ్పీ చైర్మన్‌గా బడ్డుకొండ అప్పలనాయుడు గతంలో పని చేశారు. మజ్జి శ్రీనివాసరావుకు ఆయన సమీప బంధువు. విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను అలియాస్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీకి ఇటీవల రాజీనామా చేశారు. అనంతరం ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. వారు టీడీపీలో చేరారు. ఆ కొద్ది రోజులకే చిన్న శ్రీను అనుచరులు పలువురు జడ్పీటీసీలు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. అలాగే జిల్లాలోని పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు.. ఆ పార్టీని వీడారు. దీంతో ఆ జిల్లాలో వైసీపీకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయనే ఓ చర్చ సాగుతోంది.

## సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం సీరియస్.. 46 మందికి షోకాజ్ నోటీసులు

**అమరావతి, అక్టోబర్ 3:** విజయవాడలో ఆందోళన నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఆందోళనలలో కీలకంగా వ్యవహరించిన 46 మందిని గుర్తించిన పోలీసు వర్గాలు.. వారి వివరాలతో ప్రభుత్వానికి నివేదికను అందించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ 46 మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆందోళనలో పాల్గొన్న 46 మంది ఉద్యోగుల జాబితాను జిల్లా కలెక్టర్లకు ఉన్నతాధికారులు



పంపించారు. సోమవారం సాయంత్రంలోపు ఆయా ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు పంపించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు ఉండడంతో.. ఈ జాబితాను వారికి పంపినట్లు సమాచారం. దీంతో ఇప్పటికే ఆయా జిల్లాల్లో ఉద్యోగులకు కలెక్టర్లు షోకాజ్ నోటీసులు పంపుతున్నట్లు తెలుస్తోంది. షోకాజ్ నోటీసులకు వారు ఇచ్చే వివరణ తరువాత న్యాయనిపుణులతో పరిశీలించి తదనంతర చర్యలు తీసుకోవాలని సర్కార్ ఆదేశించింది. కాగా, ఆందోళనలో పాల్గొన్న 46 మందిలో ఇప్పటికే ఒకరిద్దరిపై అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే కేసులు కూడా నమోదు చేయాలని విజయవాడ పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

## రాజమండ్రికి భారీ నిధులు.. పుష్కరాల పనులపై మంత్రి నారాయణ కీలక ప్రకటన




**అమరావతి, అక్టోబర్ 3:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించిందని మంత్రి నారాయణ తెలిపారు. రాజమండ్రిలో పుష్కరాల అభివృద్ధి పనుల కోసం రూ.1,000 కోట్లు మంజూరు చేశామని.. పుష్కరాలకు సంబంధించిన వివిధ పనులకు మొత్తం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కేంద్ర నిధులతో గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద కేంద్రం గతంలో రూ.5,350 కోట్లు మంజూరు చేసినప్పటికీ, 2019 ఫిబ్రవరిలో ఆ నిధులను వినియోగించలేదని మంత్రి ఆరోపించారు. అమరావతిని ప్రపంచంలోని టాప్-5 రాజధానుల్లో ఒకటిగా నిర్మించే లక్ష్యంతో పనులు ప్రారంభించామని మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 2028 చివరి నాటికి అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నామని తెలిపారు.

## దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

విజయవాడ, అక్టోబర్ 03: దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భక్తులకు అందించే సౌకర్యాలపై దృష్టిసారించామని తెలిపారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లో 24 గంటలూ సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. దేవాలయ పాలకమండలితో తామంతా సమన్వయం చేసుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. సీతమ్మ వారి పాదాలు వద్ద స్నానం చేసి అమ్మవారి దర్శనానికి రావచ్చని ఈ సందర్భంగా భక్తులకు ఆయన సూచించారు. అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం దుర్గమ్మవారిని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకుంటారని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భక్తులకు అందించే సౌకర్యాలపై దృష్టిసారించామని తెలిపారు.

1400 మంది సిబ్బందితో పారిశుధ్య పనులు : వీఎంసీ కమిషనర్దసరా ఉత్సవ్‌కు జాతీయ



స్థాయిలో వీఐపీలు వస్తారని విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. స్వచ్ఛ దసరా కాన్సెప్ట్ అమలు చేస్తామని చెప్పారు. పారిశుధ్య పనులకు 1400 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని అన్నారు. మూడు మూవింగ్ టాందసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఎన్టీఆర్ జిలదసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భక్తులకు అందించే సౌకర్యాలపై దృష్టిసారించామని తెలిపారు. అందించే సౌకర్యాలపై దృష్టిసారించామని తెలిపారు. న్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం: ఈవోఈ ఏడాది దసరా ఉత్సవాలకు 25 లక్షల మందికిపైగా భక్తులు విజయవాడ వస్తారని అంచనా వేస్తున్నామని దుర్గ గుడి ఈవో శీనానాయక్ వెల్లడించారు. నవరాత్రుల నుంచి రాత్రి 11.00 గంటల వరకు అమ్మవారి దర్శనం కొనసాగుతోందన్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఆ రోజు అన్ని ఆర్జిత సేవలూ పరోక్షంగా ఉంటాయని వివరించారు. అక్టోబర్ 17వ తేదీ వేద సభ ఉంటుందని అన్నారు. నవరాత్రుల్లో తాగునీరు, హోల్డింగ్ ఏరియాలో ఆహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారికి యథావిధిగా కుంకుమ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. టీటీడీ స్థలం నుంచి కుంకుమార్చన చేసే భక్తులకు వాహనాలుంటాయని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ప్లాన్ చేశామని.. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని దుర్గ గుడి ఈవో శీనా నాయక్ వివరించారు.

## చంద్రబాబు వాటర్ మ్యాన్ కాదు.. అంతా ఆర్భాటమే

**విజయవాడ:** లక్ష కోట్లతో భారీ హార్టికల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం కరవ పరిస్థితులను ప్రభుత్వం విస్మరిస్తోందన్న శ్రీకాంత్ రెడ్డి తోటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శదఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమలో లక్ష కోట్ల రూపాయల భారీ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు, ప్రభుత్వం తీవ్ర కరవు పరిస్థితులను విస్మరిస్తోందంటూ వైసీపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి రాయచోటిలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అన్నమయ్య జిల్లాలో 78.7 శాతం వర్షపాతం లోటు ఉందని, నీళ్లు లేక 800 అడుగుల లోతుకు బోర్లు వేసినా రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి, నిమ్మ తోటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా, లక్ష కోట్ల హబ్ పేరుతో ప్రచార ఆర్భాటాలు చేస్తోందని ఆరోపించారు. "చంద్రబాబు వాటర్ మ్యాన్ కాదు, ఆయన అసలైన డ్రాట్ మ్యాన్ (కరవు మనిషి)" అని శ్రీకాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. టమాటా, మిర్చి, ఉల్లి, అరటి రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతుంటే, ప్రభుత్వం బస్సు యాత్రలు, హెలికాప్టర్ పర్యటనలకు కోట్లు ఖర్చు చేస్తోందని విమర్శించారు. నష్టపోయిన



ఖరీఫ్ పంటలకు ఎకరాకు రూ. 25,000, సాగు చేయని భూములకు రూ. 15,000 తక్షణమే పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, కరవు మండలాలను గుర్తించాలని కోరారు. ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారుస్తామని చెబుతోంది. 2029 నాటికి మూడు దశల్లో పూర్తిచేయనున్న ఈ హబ్ ద్వారా 9.6 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యాన పంటల ఉత్పత్తిని రెట్టింపు చేస్తామని ప్రకటించింది. ఏదిఏమైనా, ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలపై దృష్టి సారిస్తుంటే, తక్షణమే రైతులను ఆదుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ముక్త్యాల టు మచిలీపట్నం - 168 కి.మీ కొత్త జలమార్గం - రూ.1,700 కోట్లతో భారీ ప్రాజెక్టు

**ఎన్టీఆర్ జిల్లా** ముక్త్యాల నుంచి మచిలీపట్నం వరకు భారీ జలమార్గాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా అడుగులు వేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో సుమారు రూ.1,700 కోట్ల వ్యయంతో ఈ జలరవాణా ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర జలరవాణా అథారిటీ సమర్పించిన ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ని పరిశీలించిన జాతీయ జలరవాణా అథారిటీ ప్రాథమిక



అనుమతులు మంజూరు చేసింది. జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా కొన్ని మార్పులు సూచించి, షరతులతో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేసింది. రవాణా ఎలా? : ఈ జలమార్గం మొత్తం 168 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజికి ఎగువన ఉన్న ముక్త్యాల వద్ద ఈ మార్గం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి ప్రకాశం బ్యారేజి వరకు 82 కిలోమీటర్ల మేర నది గుండా ప్రయాణిస్తుంది. ఆ తర్వాత బ్యారేజి నుంచి బందరు కాలువ మీదుగా మచిలీపట్నం వరకు 86 కిలోమీటర్ల మేర రవాణా సాగుతుంది. ఈ భారీ ప్రాజెక్టుపై చర్చించేందుకు ఏపీ జలరవాణా అథారిటీ ఛైర్మన్ శివప్రసాద్, చీఫ్ ఇంజినీరు రాఘవరావు, మేనేజర్ కల్యాణ చక్రవర్తి ఇటీవల దిల్లీ వెళ్లారు. అక్కడ కేంద్ర జలరవాణా అథారిటీ సీఈవో సుశీల్‌కుమార్‌తో ప్రత్యేకంగా సమావేశమై ప్రాజెక్టు ప్రణాళికను వివరించారు.

# మహిళా అభ్యర్థి శరీరాకృతిపై స్టాలిన్ వ్యాఖ్యలు.. క్షమాపణ చెప్పాలని విజయ్ పార్టీ డిమాండ్



**చెన్నై:** టీవీకే మహిళా అభ్యర్థి శరీరాకృతిపై స్టాలిన్ వివాదాస్పద వ్యాఖ్యలు ఇది బాడీ షేమింగ్ అంటూ అధికార టీవీకే తీవ్ర ఆగ్రహం స్టాలిన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసిన డీఎంకే చీఫ్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేగా గెలిచి టీవీకేలో చేరిన సత్యభామ తమిళనాడులో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార టీవీకే అభ్యర్థి సత్యభామను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక దళిత మహిళా అభ్యర్థిని బాడీ షేమింగ్ చేశారంటూ అధికార పార్టీ మండిపోతోంది. స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తోంది. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టాలిన్, అధికార టీవీకేపై హార్స్ ట్రేడింగ్ ఆరోపణలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తరఫున ధరాపురం నుంచి గెలిచిన సత్యభామ, కొద్ది వారాలకే తన పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఇప్పుడు అదే స్థానం నుంచి టీవీకే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆమె పార్టీ మార్పు వెనుక డబ్బు ప్రమేయం ఉందని ఆరోపిస్తూ స్టాలిన్ ప్రసంగించారు. "నిజానికి వ్యతిరేకంగా పనిచేసిన వారి అభ్యర్థిని ఇప్పుడు మీరంతా 'సూట్‌కేస్-భామ' అని పిలుస్తున్నారు. ఆమెకు 'పల్టీ-భామ' అని మరో పేరు కూడా ఉంది. ఆ శరీరాకృతితో ఆమె ఎలా పల్టీ కొట్టారో నాకు అర్థం కావడం లేదు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. సత్యభామ శరీరాకృతిపై స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలపై టీవీకే తీవ్రంగా స్పందించింది. ఇది మహిళలను, దళిత సమాజాన్ని అవమానించడమేనని ఆ పార్టీ నేత, ఆరోగ్య మంత్రి అరుణ్ రాజ్ మండిపడ్డారు. స్టాలిన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ వివాదంపై స్పందించేందుకు డీఎంకే నేతలు నిరాకరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏఐఏడీఎంకేకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో, అధికార పార్టీపై బేరసారాల ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే.

# ఎంపీల అనర్హత పిటిషన్ల ఆలస్యంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**ఢిల్లీ, సెప్టెంబర్ 28):** ఎంపీల అనర్హత పిటిషన్ల ఆలస్యంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇతరులకు మార్గదర్శకాలు ఇచ్చే ముందు మనం అద్దంలో చూసుకోవాలని జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ పవర్ ఫుల్ కామెంట్స్ చేశారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ల కాలయాపనపై విచారణ సందర్భంగా న్యాయవ్యవస్థపై విమర్శలు చేశారు. కోర్టుల్లో ఆయా పెండింగ్ కేసులను గుర్తు చేస్తూ ఫిరాయింపుల నిరోధక చట్టం విచారణపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాప్రతినిధుల అనర్హత పిటిషన్లపై ఆలస్యంపై ఈ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బాగ్చీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. స్పీకర్లకు కఠిన కాలపరిమితి విధించే ముందు కోర్టుల్లో ఉన్న కేసుల పెండెన్సీని కూడా గుర్తించాలని వ్యాఖ్యానించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్లు ఏళ్ల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంపై (సోమవారం) సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశించినా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. శాసన వ్యవస్థ ఆలస్యాన్ని ప్రశ్నించే సమయంలో కేసుల ప్రక్రియ వేగవంతం కావాలని జస్టిస్ బాగ్చీ స్పష్టం చేశారు.

## 'నిఠారీ' హత్యల నిర్దోషి సురీందర్ కోలీ.. హరిద్వార్‌లో ఆత్మహత్య



**డెహ్రాడూన్:** ఒకప్పుడు 'నిఠారీ రాక్షసుడు'గా ముద్రపడి, సంచలనం సృష్టించిన 2006 నాటి హత్యల కేసులో నిర్దోషిగా విడుదలైన సురీందర్ కోలి (ాబతీఅఅసవతీ ఖశీశ్రీఱ) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఒక టీస్టాల్ లోపల ఉరికి వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో అతడి మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న ఆధార్ కార్డ్ ఆధారంగా మృతుడిని సురీందర్ కోలిగా గుర్తించారు. గత ఏడాది సుప్రీంకోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసిన తర్వాత, గత కొంతకాలంగా హరిద్వార్‌లో టీ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. అతడి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, 2006 డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టార్ 31లోని డీ 5 బంగ్లా పక్కన ఉన్న కాలువ వెనుక ప్లాస్టిక్ సంచులలో కుక్కిన 16 మానవ పుర్రెలు, ఎముకలు, దుస్తులను పోలీసులు కనుగొన్నారు. సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన పేదలు, కూలీల కుటుంబాలకు చెందిన పిల్లలు అదృశ్యమవుతున్నట్లు స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేశారు. అయితే వారి ఆందోళనలను పోలీసులు తొలుత పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పాయల్ అనే యువతి అదృశ్యంపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఆమె మొబైల్ ఫోన్‌ను స్థానికుడైన రిక్షా వ్యక్తి వద్ద గుర్తించారు. డి-5లో నివసించే వ్యక్తి ఆ మొబైల్ ఫోన్ తనకు ఇచ్చినట్లు అతడు చెప్పాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మొనిందర్ సింగ్ పాంధర్‌కు చెందగా, సురీందర్ కోలి అక్కడ పనివాడిగా ఉన్నాడు. పోలీసులు ఆ ఇంట్లో సోదాలు చేయగా 19 మంది పిల్లల హత్యలు, నరమాంస భక్షణకు సంబంధించిన ఆధారాలు లభించాయి.

# 'కరవుతో అల్లాడుతున్న కర్ణాటకకు తక్షణమే సాయం చేయండి'



**న్యూఢిల్లీ:** వర్షాలు లేక కరవుతో అల్లాడుతున్న కర్ణాటకకు తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఎక్స్?లో పోస్ట్ చేసిన ఈ 11 పేజీల ఈ లేఖలో, కర్ణాటకలో తీవ్రంగా నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులకు తక్షణమే పరిహారం అందించాలంటూ ఖర్గే 6 కీలక అభ్యర్థనలు చేశారు. "కర్ణాటకలో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత తీవ్రమైన కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సెప్టెంబర్? నాటికి వర్షపాతం లోటు 58 శాతం మేర ఉంది. దీనితో పంట నష్టం ఏర్పడి, లక్షలాది రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏకంగా రూ.18,748.23 కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లినట్లు అంచనా. అయితే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్ డీఆర్‌ఎఫ్ ఫ్రేమ్‌వర్క్ కింద కర్ణాటక రూ.3,705.30 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని కోరింది. ఈ నేపథ్యంలోనే మేము ప్రధానమంత్రికి 6 నిర్దిష్టమైన అభ్యర్థనలు చేస్తున్నాం. అవి ఏమిటంటే, తక్షణమే పంట నష్టం అంచనాలు వేయించాలి. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కరవు నష్టాన్ని అంచనా వేసి, దానిని ధ్రువీకరించడానికి, ప్రత్యేకంగా కల్యాణ కర్ణాటకను సందర్శించడానికి ఒక కేంద్ర బృందాన్ని నియమించాలి. రూ.3,705.30 కోట్లను వెంటనే విడుదల చేయాలి. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల కింద కర్ణాటక కోరిన మొత్తాన్ని ఎలాంటి కోతలు లేకుండా వెంటనే విడుదల చేయాలి" అని ఖర్గే ఆ లేఖలో పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు రక్షణ కల్పించాలని, అర్హులైన ప్రతి రైతుకు ఇన్?పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఖర్గే కోరారు. ఇందుకోసం కాలం చెల్లిన 2015-16 వ్యవసాయ గణాంకాల ప్రకారం కాకుండా, కర్ణాటక నవీకరించిన భూమి రికార్డు ఆధారంగా రైతులకు ఇచ్చే ఇన్?పుట్ సబ్సిడీ లెక్కించాలని ఆయన ప్రధాని మోదీని కోరారు. తక్షణమే రాష్ట్రంలోని కరవు జిల్లాలను ప్రకటించాలని, ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్న 11 అదనపు తాలూకాలను, వాటితోపాటు అర్హత ఉన్న ఇతర తాలూకాలను కూడా ఇందుకోసం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కావేరి నది సహా జలవిద్యుత్? కేంద్రాల పరీవాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, తాగు నీటి భద్రత కల్పించాలని ఖర్గే కోరారు. కర్ణాటకలో 31 లక్షలకు పైగా రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని, రాజకీయాలకు అతీతంగా అత్యవసరంగా, న్యాయబద్ధంగా సహాయం అందించాలని ఖర్గే ప్రధాని మోదీని కోరారు. ఇది ఒక మానవీయ బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "భారత ప్రభుత్వం అత్యవసరంగా, మానవతా దృక్పథంతో స్పందించి, కరవు ప్రభావితమైన లక్షలాది మంది పౌరులకు అత్యవసరమైన ఆహారం, నీరు, జీవనోపాధి, పశువులకు పశుగ్రాసం అందించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఖర్గే అన్నారు. ఇదే విషయాన్ని తాను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కూడా లేఖ ద్వారా తెలియజేశానని ఆయన పేర్కొన్నారు.

# కల్కాజీ, బస్సు ఘటనల కలకలం.. ఢిల్లీ అత్యాచారాలపై సుప్రీంకోర్టు సీరియస్



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్సీఆర్)లో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న లైంగిక దాడుల ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ కేసులను సుమోటోగా స్వీకరించి, ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) నమోదు చేయాలని నేడు ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కల్కాజీ మందిర్ సమీపంలోని పార్కులో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం, కదులుతున్న స్లీపర్ బస్సులో మరో బాలికపై లైంగిక దాడి వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. జాతీయ రాజధాని ప్రాంతంలో వరుసగా జరుగుతున్న లైంగిక దాడులు, మహిళల భద్రతకు సంబంధించి శాంతిభద్రతల యంత్రాంగం, ప్రభుత్వ అధికారుల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. గౌరవంగా, ఎలాంటి భయం లేకుండా జీవించే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులో అంతర్భాగమని గుర్తుచేసింది. బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందని వ్యాఖ్యానించింది. పార్కులు, రోడ్లు, బస్సులు, మెట్రో స్టేషన్లు, సబ్‌వేలు వంటి బహిరంగ ప్రదేశాల్లో సరైన లైటింగ్, నిఘా, పెట్రోలింగ్ లేకపోవడం వంటి నివారించదగిన పరిపాలనా లోపాల వల్ల అవి ప్రమాదకర ప్రాంతాలుగా మారడాన్ని అనుమతించలేమని కోర్టు స్పష్టం చేసింది. నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, బలహీన వర్గాల రక్షణ బాధ్యతలున్న వారిపై జవాబుదారీతనాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఈ విషయంలో అధికారుల నుంచి నిర్దిష్టమైన స్పందన అవసరమని పేర్కొంది. సుప్రీం దృష్టికి వచ్చిన ఘటనలు ఇవే.. ఢిల్లీలోని కల్కాజీ మందిర్ సమీపంలోని పార్కులో 17 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటన సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. సెప్టెంబర్ 22న తన స్నేహితుడితో కలిసి పార్కుకు వెళ్లిన బాలికను, పోలీసులమని చెప్పి ముగ్గురు నిందితులు బెదిరించారు. వారి మొబైల్ ఫోన్లు లాక్కుని, బాలికను పార్కులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల్లో ఒకడైన ఆసిఫ్ తుపాకీతో బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎన్‌కౌంటర్ అనంతరం ఆసిఫ్‌ను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదే క్రమంలో గ్రేటర్ నోయిడా-ఢిల్లీ ప్రాంతంలో కదులుతున్న స్లీపర్ బస్సులో 16 ఏళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడిని కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన బాలిక, ఆగస్టులో తన స్టాప్ మిస్ అవడంతో ఓ స్లీపర్ బస్సు ఎక్కింది. బస్సు డ్రైవర్, కండక్టర్ ఆమెపై అత్యాచారం చేసి, ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వద్ద వదిలి వెళ్లిపోయారు. ఈ తీవ్రమైన ఘటనల నేపథ్యంలో, సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా జోక్యం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై త్వరలో విచారణ జరగనుంది.

## మాదకద్రవ్యాల స్మగ్లర్ నవప్రీత్ సింగ్‌ను తుర్కియే నుంచి భారత్‌కు తీసుకువచ్చాం



కరడుగట్టిన మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠా నాయకుడు నవప్రీత్ సింగ్‌ను తుర్కియే నుంచి విజయవంతంగా భారత్‌కు డిపోర్ట్ చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం వెల్లడించారు. ఇది మోదీ సర్కార్ సాధించిన ఒక గొప్ప విజయంగా ఆయన అభివర్ణించారు. "నవప్రీత్ సింగ్ 'నవాబ్ విర్' అనే నకిలీ పేరుతో తుర్కియే పౌరసత్వాన్ని పొందాడు. తర్వాత తన స్మగ్లింగ్ ముఠా సాయంతో అఫ్ఘనిస్థాన్ నుంచి భారతదేశానికి హెరాయిన్, మెథాంఫేటమిన్లను అక్రమంగా స్మగ్లింగ్ చేస్తూ వచ్చాడు. అందుకే అతనిని పట్టుకోవడానికి మన దేశ దర్యాప్తు సంస్థలు తీవ్రంగా శ్రమించాయి. అతని నకిలీ గుర్తింపు ముసుగులను ఒక్కొక్కటిగా తొలగించి, అతని అసలు స్వరూపాన్ని బయటపెట్టాయి. ఈ కృషి ఫలితంగా, తుర్కియే అతడిని తమ దేశం నుంచి బహిష్కరించి, భారత్‌కు అప్పగించింది. మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌తో పాటు, ఇతర నేరాలకు సంబంధించిన కేసుల విషయంలో అతడిని భారతదేశానికి తీసుకువచ్చి జైలులో పెట్టడం జరిగింది. ఈ విజయాన్ని సాధించిన అన్ని ఏజెన్సీలకు నా అభినందనలు. అంతే కాదు డిసెంబర్ 2029లోగా అన్ని మాదక ద్రవ్యాల ముఠాలను నాశనం చేయడానికి మోదీ సర్కార్ కట్టుబడి ఉంది" అని అమిత్? షా ఎక్స్? వేదికగా పేర్కొన్నారు.

## యువతి దుస్తులు ఊడదీసి బౌన్సర్ల దాడి.. గువాహటిలో దారుణం..!



**అస్సాం :** రాజధాని గుహవాటి లో దారుణం జరిగింది. ఓ యువతిపట్ల నైట్‌క్లబ్ బౌన్సర్లు దారుణంగా వ్యవహరించారు. ఆమె దుస్తులు ఊడదీసి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. గువాహటిలోని ఖానాపారా ప్రాంతంలో ఉన్న నైట్‌క్లబ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. యువతిపై దాడికి పాల్పడిన వారిలో మహిళా, పురుష బౌన్సర్‌లు ఉన్నారు. ఆమెను వివస్త్రను చేసి కింద పడేసి తీవ్రంగా కొట్టారు. ఇతరులు అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఆ బౌన్సర్లు దాడిని అనంతరం బాధితురాలిని క్లబ్ నాలుగో అంతస్తు నుంచి పార్కింగ్ ప్రాంతానికి తీసుకెళ్లిన దృశ్యాలు వీడియోలో ఉన్నాయి. అయితే ఈ ఘర్షణకు గల కారణాలు, బాధితురాలి వివరాలు తెలియరాలేదు. ప్రస్తుతం ఆ నైట్‌క్లబ్‌ను మూసి ఉంచినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. కాగా ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

# ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర కమిటీ ఏర్పాటు




: ఎన్నికల కమిషన్(ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమౌతున్న తరుణంలో మరో కీలక పరిణామం జరిగింది. ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక కమిటీని లాయర్స్ అసోసియేషన్ ఫర్ కాన్స్టిట్యూషన్ (ఎల్ఏఎఫ్‌సీ) ఏర్పాటు చేసింది. ఇందులో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి. లోకూర్ నేతృత్వం వహించనున్నారు. ప్రక్రియ రాజ్యాంగానికి, సంబంధిత చట్టాలకు అనుగుణంగా ఉందా అనే అంశాన్నిఈ కమిషన్ పరిశీలించనుంది. అంతేకాదు ఓటర్ల జాబితా సవరణకు అనుసరించిన విధానం ఎలా ఉంది దాని వల్ల అర్హులైన ఓటర్లపై ఎలాంటి ప్రభావం పడింది? అనే అంశాలను పరిశీలించనుంది. ముఖ్యంగా అర్హత ఉన్న పౌరుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాయా లేదా, అర్హత లేని పేర్లను సరైన విధానంలో తొలగించారా అనే విషయాలను పరిశీలించనుంది. ఎస్ఐఆర్? అమలు చేసిన విధానం, దాని చట్టపరమైన ఆధారం, అర్హులైన ఓటర్లపై పడిన ప్రభావం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. ఎస్?ఐఆర్? ప్రక్రియ కారణంగా ప్రభావితమైన పౌరులు, పౌర సమాజ సంస్థలు, నిపుణుల అభిప్రాయాలు, వాంగ్మూలాలను సేకరించనుంది. కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్, చందర్ ఉదయ్ సింగ్, ప్రశాంతో చంద్ర సేన్, రాజు రామచంద్రన్, రెబెక్కా మామెన్ జాన్, వారిషా ఫరాసత్, గ్రోవర్ వంటి ప్రముఖ న్యాయ నిపుణులు ఈ కమిషన్?కు వ్యూహాత్మక న్యాయ సలహాలు అందించనున్నారు.

# సంపాదకీయం



## వర్షపాతం అంచనాల్లో పొరపాట్లు

భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనాల్లో సంప్రదాయబద్ధంగా జాగ్రత్తగా, మితంగా వ్యవహరిస్తుండడంతో వాస్తవాలు బయటపడక పొరపాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా వర్షపాతం లోటును అంచనా వేయడంలో కొంత అజాగ్రత్త కనిపిస్తోంది. రుతుపవనాలు ప్రారంభానికి ముందు ఏప్రిల్, మే నెలల్లో రెండు అంచనాలు విడుదల చేయడం పరిపాటి. అయితే ఈసారి రెండు అంచనాలు కూడా సంవత్సరం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని స్పష్టంగా సూచించాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో చాలా బలంగా ఏర్పడుతోందని అంచనాలు ఉండడంతో, వర్షపాతం ఎంత తీవ్రంగా తగ్గుతుందనే ప్రశ్న వచ్చింది. చివరకు చూస్తే ఐఎండి వెల్లడించిన 'సాధారణం కంటే తక్కువ' వర్షపాతం (సగటులో 90 శాతం95 శాతం ) అంచనా వాస్తవ పరిస్థితితో పోలిస్తే చాలా జాగ్రత్తగా చేసిన అంచనా అని తేలింది.ఎందుకంటే ఐఎండి మోడళ్లు, ఇప్పటికే 'లోటు' వర్షపాతం (సగటులో 90 శాతం కంటే తక్కువ) ఉంటుందని సూచిస్తున్నాయి. అంటే ఐఎండి మోడళ్లు, వర్షాలు 90 శాతం కంటే తక్కువగా ఉండవచ్చని సూచించినప్పటికీ, అధికారికంగా మాత్రం 90 శాతం95 శాతం మధ్య ఉండొచ్చని కొంచెం సురక్షితమైన అంచనాను ప్రకటించింది. సెప్టెంబర్ 30న దేశ రుతుపవనాల సీజన్ ముగిసినట్టు ప్రకటించినప్పుడు, దేశవ్యాప్తంగా 759 మి.మీ వర్షపాతం నమోదైందని, సాధారణంగా కురవాల్సిన 869 మి.మీలో ఇది 87 శాతం మాత్రమేనని వాతావరణ శాఖ తెలియజేసింది. భూమధ్యరేఖ, పసిఫిక్ మహాసముద్రం వేడెక్కి భారత రుతుపవన వర్షాలు ఎల్‌నినో ప్రభావం వల్ల తగ్గిపోతుంటాయి.ఈ విధంగా ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షపాతం ఎంతమేర తగ్గుతుందో ముందుగానే అంచనా వేయడం వాతావరణ శాఖకు సవాలుగా ఉంటోంది. అయితే వర్షపాతం తక్కువగా ఉంటుందని ముందే తెలిసినప్పుడు 'సాధారణం కంటే తక్కువ' అని కాకుండా 'లోటు/ తీవ్రంగా తక్కువ' అని హెచ్చరించి ఉంటే, తమ అంచనా మరింత ఖచ్చితమైనదని చెప్పుకునే అవకాశం ఉండేది. అందుకే ఐఎండి 'సాధారణం కంటే తక్కువ' అనే పదాన్ని ఎందుకు ఎంచుకుందో అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది. ప్రస్తుతం ఐఎండి సాధించినది సాంకేతికంగా మాత్రమే ఒక విజయంగా చెప్పవచ్చు. ఐఎండి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేసింది: తుది గణాంకం ఆ అంచనాకు దగ్గరగానే ఉన్నప్పటికీ, అంచనా చాలా ఖచ్చితమైనదని చెప్పడానికి 45 శాతం ఎర్రర్ మార్జిన్ కనిపిస్తోంది. నెలలవారీగా విశ్లేషిస్తే వర్షపాతం ఎంత ఉంటుందో అంచనా వేయడంలో వాతావరణ శాఖ ఎదుర్కొన్న సమస్య మరింత స్పష్టమవుతోంది. జూన్‌లో సాధారణ వర్షపాతంలో కేవలం 65 శాతం మాత్రమే నమోదైంది.కానీ ఐఎండి 92 శాతం వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. అంటే వాస్తవ వర్షపాతం అంచనా కంటే చాలా తక్కువగా ఉంది. జులైలో వర్షపాతం 94 శాతం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేయగా, వాస్తవానికి అంచనా కంటే 1 శాతం పాయింట్ ఎక్కువ వర్షం కురిసింది. ఆగస్టులో సాధారణ వర్షపాతంలో 84 శాతం నమోదైంది. ఇది '94 శాతం కంటే తక్కువ' అనే అంచనాకు అనుగుణంగా ఉంది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతంలో 92.4 శాతం నమోదైంది. ఇది '91 శాతం కంటే తక్కువ' అనే అంచనా కంటే కొంచెం ఎక్కువ. ఈశాన్య భారతంలో 'సాధారణ స్థాయి వర్షపాతం' ఉంటుందని అంచనా వేసింది. కానీ అక్కడ 1901 తర్వాత అత్యంత తక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 26 శాతం తక్కువ. దక్షిణ భారతంలో వర్షపాతం సాధారణం కంటే 23 శాతం తక్కువగా నమోదైంది.మధ్యభారతం, వాయువ్య భారతంలో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం ఉంటుందని ముందే అంచనా వేశారు. వాస్తవ ఫలితాలు కూడా దాదాపు ఆ అంచనాలకు దగ్గరగానే ఉన్నాయి. దీనికి పశ్చిమం నుంచి వచ్చే తుపాన్లు వంటి అవాంతరాలు, సముద్ర పరిస్థితులు కారణమయ్యాయి. మొత్తం రుతుపవనాల పరిస్థితిని కొంతవరకు ఐఎండి అంచనా వేయగలిగినా, ఏ నెలలో, ఏ ప్రాంతంలో ఎంత వర్షం పడుతుంది అనే అంచనాలు కొన్నిసార్లు వాస్తవానికి భిన్నంగా ఉంటున్నాయి. పశ్చిమ అలజడులు అనే అదనపు ఉష్ణమండల వర్షాన్ని తెచ్చే వాతావరణ వ్యవస్థలు, రుతుపవనాల కాలంలో దేశంలో మరింత వర్షాన్ని కురిపిస్తున్నాయి. అదే సమయంలో దక్షిణ భారత దేశం ఎల్‌నినో వల్ల కలిగే వర్షపాతం మార్పులకు ఎక్కువగా ప్రభావితమవుతోంది. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది.జులై 10 నాటికి గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ విత్తనాలు వేయడంలో 16 శాతం వెనకబడి ఉండగా, సెప్టెంబర్ నాటికి ఆ తేడా 2 శాతం కంటే తక్కువకు తగ్గింది. కర్ణాటకలో 100కు పైగా తాలూకాలను, మహారాష్ట్రలో 358 లో 265 తాలూకాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించారు. అయితే దేశ వ్యాప్తంగా వర్షపాతం లోటు సుమారు 12 శాతం మాత్రమే ఉండగా, 'వ్యవసాయ కరువు'గా కేంద్రం పరిగణించడానికి 20 శాతం పరిమితి కంటే తక్కువ ఉండడం గమనార్హం. ఎల్‌నినో మరింత బలపడి అక్టోబర్ డిసెంబర్ మధ్య దేశం లోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావచ్చని ఐఎండి అంచనా వేసింది. ఈ అంచనాలు రైతులు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపిస్తాయి. అందువల్ల ప్రాంతాల వారీగా మరింత ఖచ్చితమైన వాతావరణ అంచనా వ్యవస్థలను అభివృద్ధి చేయడం అవసరం. అవసరమైతే ప్రతికూల వాతావరణ సమాచారాన్ని కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం ఐఎండి బాధ్యత.

## మల్లేష్ గతంలో కూడా చాలా నేరాలకు పాల్పడ్డాడు: సిపి సుమతి



**హైదరాబాద్:** బొల్లారం ఆయుధాల చోరీ కేసులో ప్రధాన నిందితుడు మల్లేష్ ఇచ్చిన వివరాలతో ఏడుగురిని అరెస్ట్ చేశామని సిపి సుమతి తెలిపారు. ఆయుధాల చోరీ కేసులో సంబంధిత నిందితుల వివరాలను కోర్టులో ప్రవేశ పెట్టామని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నిందితులు శేషులు, వినోద్, ప్రవీణ్, నిరంజన్ ను, మల్లికార్జున్, బీర్బల్ షా, అవిదెయ్ ను అరెస్టు చేశామని తెలియజేశారు. నిందితుడు మల్లేష్ గతంలో కూడా చాలా నేరాలకు తన స్నేహితులతో కలిసి మల్లేష్ ఆయుధాల చోరీకి పాల్పడ్డాడని, ఆయుధాల చోరీ చేసేందుకు పక్కా ప్రణాళికలు నిర్వహించాడని సిపి సుమతి పేర్కొన్నారు

# హింస తప్ప మరేమున్నది



గత 600 సంవత్సరాలుగా పాశ్చాత్య రాజ్యాల కూటమి తక్కిన ప్రపంచ దేశాలపై హింస సాగించనిది ఎప్పుడు భూభాగాల కోసం, వనరుల కోసం, బానిసల కోసం, మార్కెట్ల కోసం, ఆధిపత్యాల కోసం. యుద్ధాలు జరిగినప్పుడు, జరగని సమయాలలోనూ. తమ మధ్య జరిగిన పరస్పర ఆధిపత్య యుద్ధాల కోసం కూడా ఇండియా సహా ఇతర దేశాల యువకులను బలవంతంగా సైన్యాలలో చేర్చుకుని బలిపెట్టనిది ఎన్నడు గత 600 సంవత్సరాల ఘర్షణలు, యుద్ధాలలో ఎన్ని కోట్ల మంది వారి హింస వల్ల బలయ్యారు వారి దోపిడీల వల్ల ఏర్పడిన కరువు కాటకాలకు, హింసకు బలైనది ఎందరు వారు ప్రవచించే ప్రజాస్వామ్యమే ఒక వంచన, ఒక హింస కాదా తమ నిరంతర దోపిడీకి ఒక ముసుగు కాదా యథాతథంగా ప్రజాస్వామ్య భావన, ఆ వ్యవస్థలు అత్యద్భుతమైనవి. అవి ప్రజలు తమ మేలు కోసం మనస్ఫూర్తిగా కోరుకునేవి. పాశ్చాత్య తత్తవేత్తలు కూడా ఎంతో కూలంకషంగా నిర్వచించినవి.నక్సలైట్లు 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అని అంటే చాలా విమర్శలు వచ్చాయి. వారిని హింసావాదుల న్నారు. అణచివేశారు. నిజమే. ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలించేందుకు ప్రజాస్వామికమైన ఓటింగ్ వ్యవస్థ ఉండగా అటువంటి మార్గం అక్కర లేదు. కాని ఒకసారి అంతర్జాతీయ దృశ్యాన్ని చూడండి. ప్రపంచంలో అతి గొప్ప ప్రజాస్వామ్యమని, అతి శక్తివంతమైన ప్రజాస్వామ్యమని చెప్పుకునే అమెరికా ఏమి చేస్తున్నది ఇంకా మాట్లాడాలంటే, ఆధునిక ప్రజాస్వామ్యానికే పుట్టినిల్లు అని చాటుకునే బ్రిటన్ మొదలుకొని, పలు యూరోపియన్ రాజ్యాలు గత 600 సంవత్సరాలుగా చేస్తున్నదేమిటి తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆయుధాలను సమకూర్చుకోవటం, ఇతరులపై హింస సాగించటం మినహా మరేమున్నది వారి చరిత్ర యావత్తూ హింసాత్మకమే.ఇప్పటికిప్పుడు మన కళ్ల ముందు ఎంతెంతో జరుగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌ను ఆయుధాలతో బెదిరించక ఒక్క వారమైనా గడవటం లేదు. దాడులు సరేసరి. మొత్తం ఇరాన్ జాతిని, సంస్కృతిని రాత్రికి రాత్రి తుడిచిపెట్టగలనని హెచ్చరిస్తుంటారు. తాము యావత్ ప్రపంచంలోనే అతి శక్తివంతులమని, అట్లా తుడిచిపెట్టగల ఆయుధ సంపత్తి తమకుందని తరచు గుర్తు చేస్తుంటారు. హింస తప్ప మరేమున్నది ఇరాన్ ప్రజాస్వామికంగా ముందుకు వచ్చి, శాంతియుత అవగాహన కోసం చర్చలకు కూర్చుంటుంది. చర్చలు సాగుతుంటాయి. అవి సంతృప్తికరంగా పురోగమిస్తున్నట్లు మధ్యవర్తులు ప్రకటిస్తారు కూడా. అంతలో అకస్మాత్తుగా, చర్చల మధ్యలోనే, అమెరికా, ఇజ్రాయెల్ కలిసి టెహ్రాన్‌పై బాంబులు వేస్తాయి. ఇరాన్ అధినేతను కుటుంబంతోపాటు పొట్టన పెట్టుకుంటాయి. ప్రపంచం నిర్ఘాంతపోతుంది. తమ చర్యకు కారణమేమిటో ఆ రెండు దేశాలు వివరించవు. హింస తప్ప మరేమున్నదికారణాలపై మీడియా ఊహాగానాలు చేస్తుంది. అధికారిక వర్గాల సమాచారమంటూ కూపీలు లాగుతుంది. యుద్ధ నిపుణులు, రాజకీయ పండితులు విశ్లేషణలు చేస్తారు. చర్చలు, ప్రజాస్వామికమైన పరిష్కారాలు అసలు ఇజ్రాయెల్‌కు ఇష్టం లేదంటారు. వెనిజులా అధ్యక్షుడిని, ఆయన భార్యను అర్ధరాత్రి సైనిక ఆపరేషన్ జరిపి కొన్ని వందల మందిని కాల్చి చంపి, అపహరించుకుపోయినందున అక్కడి ప్రభుత్వం లొంగిపోయిన తరహాలో, ఇరాన్ అధినేత హత్యతో అక్కడి వ్యవస్థ కూడా లొంగిపోగలదన్న వ్యూహాన్ని ఇజ్రాయెల్ రచించి, ట్రంప్‌ను మెప్పించి, ఆ విధమైన దాడి జరిపారని తేల్చి చెప్పుతారు. దీనంతటిలో హింస తప్ప ఇంకేమున్నదిఅణ్వాస్త్రాలు వేల కొద్దీ అమెరికా వద్ద ఉంటాయి. వంద వరకు ఇజ్రాయెల్ వద్ద ఉంటాయి. మరి కొన్ని వందలు నాటో కూటమి దేశాలకు ఉంటాయి. వీరందరి మిత్రదేశాలు అనేకం శాంతియుత వినియోగం కోసం అణు పరిశోధనలు జరుపుతుంటాయి. వారందరికి వీరు సహకరిస్తుంటారు. ఇటీవలనే సౌదీ అరేబియాకు అటువంటి సహాయ ప్రతిపాదన చేస్తారు. కాని ఇరాన్‌కు మాత్రమే ఎటువంటి అవకాశమూ ఉండరాదంటారు. అణ్వాయుధాలను కాదనటం సరేసరి. శాంతియుత ఉపయోగానికి సైతం వీలు లేదంటారు. అక్కడ తమకు అనుకూలుడైన రాజు పాలించినప్పుడు అణు రియాక్టర్లు అందజేసింది తామే. కాని స్వతంత్రంగా వ్యవహరించే పాలకులు రావటంతో అన్ని సూత్రాలు తలకిందులవుతాయి. తమ ప్రణాళిక ఆయుధాల ఉత్పత్తి కాదని కొత్త ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తుంది. అణ్వాయుధ నిరోధక ఒప్పందంపై (ఎన్‌పిటి) ఇజ్రాయెల్ సంతకం చేయకున్నా తాను చేస్తుంది. అణు పరిశోధనా కేంద్రాలను తరచు తనిఖీ చేసేందుకు అంతర్జాతీయ అణు పరిశోధనా సంస్థ (ఐఎఇఎ) ఇన్‌స్పెక్టర్లను అనుమతిస్తుంది. అణ్వాయుధాల వంటి సామూహిక హనన ఆయుధాల తయారీ ఇస్లాం కు విరుద్ధమని, కనుక వాటి ఉత్పత్తి జరపరాదని తమ ప్రభుత్వానికి ఖమేనీ ఏకంగా ఒకటికి రెండు సార్లు ఫత్వాలు జారీ చేస్తారు. ఏదిఏమైనా సరే. ఇరాన్ ఉన్నది తమ ఆదేశాల మేరకుగాక స్వతంత్రంగా వ్యవహరించే ప్రభుత్వం. అక్కడి అపారమైన చమురు, గ్యాస్ నిల్వలను తమ కంపెనీలకు అప్పగించేది కాదు. కనుక నూటొక్క సాకులు వెతికి దాడులు సాగించవలసిందే. ఇందులో అడుగడుగునా హింస గాక మరేమి కనిపిస్తున్నదిఇరాన్ అమెరికాను ఎప్పుడూ ఏమీ చేయలేదు. అక్కడి ప్రజలు తమ ఇంధన వనరులు తమకు కావాలని కోరుకుని బ్రిటిష్ కంపెనీల అధీనంతో ఉండిన వాటిని 1953లో స్వాధీనపరచుకున్నారు. అది బ్రిటిష్ వ్యతిరేక చర్యే తప్ప అమెరికా వ్యతిరేకమైనది కాదు. అయినప్పటికీ అమెరికన్ సిఐఎ వారు బ్రిటన్‌తో చేతులు కలిపి ఆ ప్రభుత్వాన్ని కూలదోశారు. హింసను రెచ్చగొట్టారు. అది సహించని ప్రజలు, తిరిగి అధికారాన్ని వశపరచుకున్న రాజును పడగొట్టారు. అప్పటి నుంచి మొదలైన అమెరికన్ పాశ్చాత్య కూటమి కుట్రలు నేటికీ కొనసాగుతున్నాయి. చేయని దాడులు, విధ్వంసాలు లేవు. వేలకు వేల మంది పౌరుల ప్రాణాలు తీశారు. నేటికీ అదే పని చేస్తున్నారు. తమ షరతులకు అంగీకరించట్లయితే ఎంత కాలమైనా విధ్వంసం సాగిస్తామంటున్నారు. ఎన్ని తరాల నాయకులనైనా హతమార్చగలమని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. దీనినంతా ఏమంటారు హింసగాకఈ దుర్మార్గమంతటిలో బలి అవుతున్న పాలస్తీనా మాటేమిటి అది ఒక స్వతంత్ర దేశం. అక్కడ రెండవ ప్రపంచ యుద్ధం వరకు ఇజ్రాయెల్ అనేది లేదు. అపుడు పాశ్చాత్యులు కొత్తగా సృష్టించారు. అందుకోసం పాలస్తీనాను విభజించారు. పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండు స్వతంత్ర దేశాలుగా పక్కపక్కనే ఉంటాయన్నారు. ఐక్యరాజ్య సమితిలో తీర్మానం కూడా చేశారు. అప్పటి నుంచి దశాబ్దాలుగా జరుగుతున్నదేమిటి పాలస్తీనా కొనసాగుదల ఇజ్రాయెల్‌కు ఇష్టం లేదు. అమెరికాకు ఇష్టం లేదు. వారికి కావలసింది గాజా, వెస్ట్ బ్యాంక్‌లను కూడా ఆక్రమించుకునే గ్రేటర్ ఇజ్రాయెల్. అందుకోసం గాజాను ధ్వంసం చేస్తారు. మారణహోమం సాగిస్తారు. వారికి అమెరికా ఆయుధాలు, నిధులు సరఫరా చేస్తుంది. యూరోపియన్లు ఆయుధాలు బదిలీ చేస్తారు. వాణిజ్యం ద్వారా నిధులు సమకూర్చుతారు.ఇజ్రాయెల్‌ను అదుపు చేసే తీర్మానాలను భద్రతా సమితిలో వీటో చేస్తారు. నెతన్యాహును దోషిగా ప్రకటించే అంతర్జాతీయ న్యాయ సంస్థపై ఆంక్షలు విధిస్తారు. న్యాయమూర్తులను బెదిరిస్తారు. దీనంతటిలో హింస లేని దెక్కడ వెస్ట్ బ్యాంక్‌ను కూడా ఆక్రమించుకుంటున్న ఇజ్రాయెల్ అక్కడి పాలస్తీనియన్లను దాడులతో తరిమివేస్తూ వేలాది యూదులను సెటిల్ చేస్తుంది. సెటిలర్ల హింసకు సైన్యం ద్వారా మద్దతునిస్తుంది. సెటిల్‌మెంట్లకు నిధులిస్తుంది. అదంతా అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్న ఐక్యరాజ్య సమితి ఖండనలను లెక్క చేయదు. రాజధానిని టెల్ అవీవ్ నుంచి వెస్ట్ బ్యాంక్‌లోని జెరూసలేంకు మార్చుతుంది. ఆ మార్పును ట్రంప్ మహాశయుడు గుర్తిస్తారు. సెటిల్మెంట్లను కాదనడు. వెస్ట్ బ్యాంక్ హింసను మానవ హక్కులు సంస్థలు, నిష్పాక్షికమైన పాశ్చాత్య మీడియా సంస్థలు సైతం ఎత్తి చూపుతుంటాయి. అయినా ఏదీ ఆగదు. హింస జరగనిదెక్కడమొదట అనుకున్నట్లు, గత 600 సంవత్సరాలుగా పాశ్చాత్య రాజ్యాల కూటమి తక్కిన ప్రపంచ దేశాలపై హింస సాగించనిది ఎప్పుడు భూభాగాల కోసం, వనరుల కోసం, బానిసల కోసం, మార్కెట్ల కోసం, ఆధిపత్యాల కోసం. యుద్ధాలు జరిగినప్పుడు, జరగని సమయాలలోనూ. తమ మధ్య జరిగిన పరస్పర ఆధిపత్య యుద్ధాల కోసం కూడా ఇండియా సహా ఇతర దేశాల యువకులను బలవంతంగా సైన్యాలలో చేర్చుకుని బలిపెట్టనిది ఎన్నడు గత 600 సంవత్సరాల ఘర్షణలు, యుద్ధాలలో ఎన్ని కోట్ల మంది వారి హింస వల్ల బలయ్యారు

వారి దోపిడీల వల్ల ఏర్పడిన కరువు కాటకాలకు, హింసకు బలైనది ఎందరు వారు ప్రవచించే ప్రజాస్వామ్యమే ఒక వంచన, ఒక హింస కాదా తమ నిరంతర దోపిడీకి ఒక ముసుగు కాదా యథాతథంగా ప్రజాస్వామ్య భావన, ఆ వ్యవస్థలు అత్యద్భుతమైనవి. అవి ప్రజలు తమ మేలు కోసం మనస్ఫూర్తిగా కోరుకునేవి. పాశ్చాత్య తత్తవేత్తలు కూడా ఎంతో కూలంకషంగా నిర్వచించినవి. కాని ఆ సామ్రాజ్యవాదులు ఆ మాటనే ఒక నిరంతర హింసా కూపంగా మార్చివేశారు. హింసను, యుద్ధాలనే విదేశాంగ విధానం చేసుకున్నారు.

# సమ్మెలతో ఫలితం సాధ్యమేనా




సమ్మెల గురించి ఉద్యోగులు ఒకటికి రెండు సార్లు ఆలోచించే కాలమిది. అన్ని రంగాల్లో టెక్నాలజీ పెరిగిపోవడంతో ఉద్యోగులు, కార్మికులు అలకబూనినా, సహాయ నిరాకరణ చేపట్టినా.. దాని ప్రభావం పూర్వపు స్థాయిలో ఉండడం లేదు. తమ ప్రయోజనాలకే కాకుండా దేశ ప్రజల సంక్షేమం కూడా దృష్టిలో పెట్టుకొని ఉద్యమించే ఉద్యోగ స్ఫూర్తి వారిలో ఉండేది. ఆ బాధ్యతతో ఉద్యోగులు ఎన్నో ప్రజా ఉద్యమాలకు మద్దతుగా రంగంలోకి దిగిన సందర్భాలున్నాయి. ఇప్పుడు వారి సమస్యల నుండి గట్టెక్కడానికే తిప్పలు పడుతున్నారు. రవాణా, పోస్టల్, బ్యాంకింగ్ తదితర ప్రజాజీవితాలకు ముడిపడి ఉన్న బలమైన రంగాలు సమ్మె తలపెట్టితే ప్రభుత్వాలు దిగివచ్చేవి. ఇప్పుడు మాత్రం సమ్మెకు ఉద్యోగులు వెనకాముందు అవుతున్నారు. ఉద్యోగులు న్యాయమైన హక్కుల కోసం సమ్మెకు దిగితే ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా అణచివేసిన సంఘటనలు మన చుట్టూ ఉన్నాయి.మానవ శ్రమ, ప్రమేయం తగ్గి సర్వం యంత్రమయం కావడమే దీనికి కారణం. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు కునారిల్లుతూ, వాటి సంఖ్య తగ్గిపోతూ ఉండగా, అన్ని రంగాల్లో ప్రైవేటుదే పైచేయి కావడం అనేది కార్మిక రంగంపై మరో బలమైన దెబ్బ. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ కంప్యూటరైజేషన్ అయ్యాక, ప్రైవేటు బ్యాంకులు వచ్చాక ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగుల పట్టు చేజారిపోయింది. ఏడాదికి ఒకట్రెండు సార్లు జరిగే బ్యాంకు సమ్మెలు తగ్గిపోయాయి. యాంత్రీకరణకు ముందు రోజుల్లో కాగితాలపై రాసే లెక్కలు ఉద్యోగుల అధీనంలో ఉండేవి. వారు సమ్మెకు దిగితే ఆర్‌బి ఐకి ఏ సమాచారం అందేది కాదు. యాన్వల్ క్లోజింగ్ సమయాన ఆ ఆర్థిక సంవత్సరపు లెక్కలు చేయం అని బ్యాంకు సిబ్బంది సమ్మె అస్త్రం ప్రయోగిస్తే ప్రభుత్వం వెంటనే దిగివచ్చేది.దేశ ఆర్థిక గణాంకాలు, లావాదేవీల కదలిక, నగదు చలామణి అంతా ఉద్యోగుల గుప్పిట్లో ఉన్నందున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్చలకు ఆహ్వానం పంపేది. ఈ కీలక సమయాల్లో ఎన్నో డిమాండ్లను, అలవెన్సులను బ్యాంకు ఉద్యోగులు పట్టుపట్టి సాధించుకున్న సందర్భాలు అనేకం. దశలవారీగా మన దేశంలో ప్రభుత్వ బ్యాంకులు కంప్యూటరీకరణ చెందాయి. 1980 నుండి 1990 దాకా పాక్షికంగా పనులు చేసి పెట్టిన సాఫ్ట్‌వేర్ 2000 నుండి కోర్ బ్యాంకింగ్ సిస్టం ద్వారా అన్ని పనులు కంప్యూటర్లే చేయడం మొదలైంది. ఉద్యోగులు తొలుత బ్యాంకుల కంప్యూటరీకరణను వ్యతిరేకించారు. వద్దని సమ్మెలు కూడా చేశారు. ప్రభుత్వం వారిని మెప్పించేందుకు వేతనంలో అదనంగా కంప్యూటర్ ఇంక్రిమెంట్ కలిపింది.అలా ప్రస్తుతం బ్యాంకింగు రంగం పూర్తిగా పేపర్ ఫ్రీ వ్యవస్థగా మారిపోయింది. ప్రతి కంప్యూటర్ లోని సమాచారం వెనువెంటనే ప్రభుత్వం అధీనంలో ఉండే నియంత్రిత వ్యవస్థలోకి చేరిపోతుంది. బ్యాంకు సిబ్బంది ప్రమేయం లేకుండానే ఆ రోజుటి మొత్తం లావాదేవీలు ప్రభుత్వానికి అందుతాయి. రాత్రంతా డేటా ప్రాసెస్ అయి మర్నాడు ఉదయమే మొత్తం బ్యాంకుల ఆర్థిక ముఖచిత్రం కనబడుతుంది. తన ముందున్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయడం తప్ప మరే వ్యవస్థ ఉద్యోగుల నియంత్రణలో లేదు. సమ్మె పేరిట బ్యాంకు సమాచారాన్ని ప్రభుత్వానికి అందించకుండా ఆపే వీలు లేకుండా పోయింది. దీనితో బ్యాంకు ఉద్యోగుల సమ్మె భయం నుంచి ప్రభుత్వం పూర్తిగా బయటపడింది.మరోవైపు ప్రైవేటు బ్యాంకుల ఉధృతి ప్రభావం ప్రభుత్వ రంగ బ్యాంకులపై విపరీతంగా ఉంది. తేలికైన విధానాలతో ప్రైవేటు బ్యాంకు లు అడిగిన వెంటనే గృహ, వాహన రుణాలు ఇస్తూ వ్యాపారాన్ని కైవసం చేసుకుంటున్నాయి. వారి ప్రతినిధులు ఇంటి వద్దకు వచ్చి డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుంటున్నారు. ఉదయం అడిగితే సాయంత్రం కారు కీస్ చేతికి వస్తున్నాయి. ఈ సౌలభ్యం ప్రభుత్వ బ్యాంకుల్లో సాధ్యం కాదు. రూల్స్ పాటించకపోతే ఉద్యోగానికే ముప్పు. ఆడిట్‌లో ఒక్క కాగితం తక్కువున్నా రిమార్కే. ఈ చట్రంలోంచి ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి బయటకి రాలేడు. ఇందువల్ల రోజురోజుకు బ్యాంకింగ్ వ్యాపారం ప్రైవేటు శక్తుల చేతిలోకి వెళ్ళిపోతోంది.

## తిరుమలగిరి కొండపై కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి- ఒక్కసారి దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయట!



కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి స్వయంభువుగా వెలసిన పుణ్య క్షేత్రం. భరద్వాజ మహర్షి కోరిక మేరకు వెలసిన స్వామి! స్వయంభూ వాల్మీకోద్భవుడుగా పూజలందుకునే వేంకటేశ్వర స్వామి! స్వామివారి పాద ఘట్టనతో ఏర్పడిన కోనేరు! తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎక్కడుంది?కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటకు సమీపంలో, ప్రశాంతమైన గ్రామంలో ప్రకృతి రమణీయత నడుమ గ్రామానికి ఉత్తరాన ఉన్న తిరుమలగిరి కొండపై కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎంతో విశిష్టమైన పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిస్తూ, వారి అభీష్టాలను నెరవేర్చే దైవంగా ప్రసిద్ధి చెందారు. గ్రామానికి ఉత్తర దిశలో ఉన్న తిరుమలగిరి పర్వతంపై ఈ ఆలయం వెలసి ఉంది. భరద్వాజ మహర్షి కోరిక మేరకు వేంకటేశ్వర స్వామి ఇక్కడ వెలసినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

### స్థల పురాణం

ఆలయ స్థల పురాణం ప్రకారం త్రేతాయుగంలో భరద్వాజ మహర్షి దక్షిణ దేశ యాత్ర చేస్తున్న సందర్భంగా ఈ ప్రాంతంలో కూడా ఘోరమైన తపస్సు చేశారు. మహర్షి తపస్సుకు ప్రసన్నుడైన శ్రీ మహా విష్ణువు ప్రత్యక్షమై, 'ఏమి కావాలో కోరుకో' అని వరం ప్రసాదించేందుకు సిద్ధపడ్డారు.

### స్వామిని అక్కడే వెలసి ఉండమని కోరిన మహర్షి

అప్పుడు భరద్వాజ మహర్షి "స్వామీ! ఈ ప్రాంతంలో ప్రజలు తమ కష్టసుఖాలు చెప్పుకుని సేద తీరడానికి ఇక్కడ ఒక ఆలయం కావాలి. అప్పుడే వారు సేద తీరగల్గుతారు. అందుకోసం నీ అంశను వేల్పుగా ప్రసాదించమని కోరాడట! అలాగే ప్రజలను సంరక్షించడానికి ఈ పవిత్ర ప్రాంతంలోనే శాశ్వతంగా కొలువై ఉండాలి" అని వేడుకున్నాడంట! మహర్షి కోరికను మన్నించిన శ్రీమహావిష్ణువు ఈ కొండపై శ్రీ వేంకటేశ్వర స్వామిగా కొలువై ఉన్నారని స్థలపురాణం చెబుతోంది. అనంతరం భరద్వాజ మహర్షి స్వామితో "ఈ కొండపై నదీ ప్రవాహం లేనందున నిర్మల జలతరంగిణి కూడా ఏర్పాటు చేయమని" కోరగా స్వామి అలాగే అని వరమిచ్చి అంతర్ధానమయ్యాడంట!

### కొండపై వెలసిన కోనేటి రాయడు

మర్నాడు తెల్లవారుఝామున తిరుమలగిరి కొండపై మహా తేజస్సుతో అఖండ శిలారూపంలో శ్రీ వేంకటేశ్వర స్వామి స్వయంభువుగా అవతరించాడు. అందుకే ఈ కొండకు, గ్రామానికి తిరుమలగిరి అనే పేరు వచ్చినట్లు చెబుతారు.

### వాల్మీకోద్భవుడుగా అవతరించిన స్వయంభూ వేంకటేశ్వరుడు

ఈ క్షేత్రంలోని స్వామివారిని స్వయంభూ వాల్మీకోద్భవుడుగా భక్తులు కొలుస్తారు. ఇందుకు ఓ కారణం ఉంది. స్వామివారి విగ్రహం వెనుక భాగంలో పెద్ద శిలా వల్మీకం కూడా వెలసి ఉంది. స్వామివారి విగ్రహం వెనుక భాగంలో ఈ విధంగా శిలా వాల్మీకం ఉండటం ఈ క్షేత్రంలోని ప్రత్యేకతగా వివరిస్తుంది. ఈ పెద్ద రాతివల్మీకం, వేంకటేశ్వరుడు కలిసి ఉండడం మరో గొప్ప విశేషం.

### పాద ఘట్టనతో ఏర్పడిన కోనేరు

ఈ క్షేత్రంలో స్వామి వారి ఆలయానికి తూర్పు వైపున మరో అద్భుతమైన విశేషం ఉంది. ఇక్కడ శిలపై స్వామి వారి ఎడమ పాద ఘట్టనతో కోనేరు ఏర్పడిందని స్థల పురాణం చెబుతుంది. ఏకశిలలో పాదముద్ర ఆకృతిని పోలిన ఈ పవిత్ర స్థలం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.

### తిరుమలగిరి పేరు ఇలా వచ్చింది

వేంకటేశ్వరుడు వెలసిన ఈ గ్రామం పేరు తిరుమల కాగా, ఈ గ్రామానికి జంటగా మంగొల్లు అనే గ్రామం ఉంది. ఇదే పద్మావతి దేవి నివసించిన మంగాపురం అని స్థానికుల విశ్వాసం. తిరుమలగిరికి కొంచెం దూరంలోనే ఉన్న ఈ గ్రామాన్ని తొలుత మంగప్రోలు అనేవారు. కాలక్రమేణా ఇదే మంగవోలుగా మారి చివరకు మంగొల్లుగా స్థిరపడింది.

### ఆలయ విశేషాలు

గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి నిలువెత్తు విగ్రహాన్ని దర్శించగానే తిరుమల శ్రీనివాసుని దర్శించిన అనుభూతి కలుగుతుంది. ఇక క్షేత్ర పాలకుడైన ఆంజనేయ ఇక్కడ నాలుగు ఆలయాలు ఉండడం విశేషం.

### నాలుగు ఆంజనేయ స్వామి ఆలయాలు

తిరుమలగిరి కొండల పరిసర ప్రాంతంలో నాలుగు ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయని చెబుతారు. ఈ ఆలయాలు కూడా భక్తులను ఆకర్షిస్తూ, తిరుమలగిరి క్షేత్రానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తీసుకువచ్చాయి.

### కల్యాణ మహోత్సవం

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కనుల పండుగగా నిర్వహిస్తారు. ఈ సమయంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతారు. ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటే అవివాహితులకు కల్యాణ జరుగుతుందని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

## కదిలే శివలింగం- ఎంత తవ్వినా దొరకని మూలస్థానం- ఎక్కడుందో తెలుసా?



బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సృష్టి స్థితి లయ కారకులు. త్రిమూర్తులలో పరమేశ్వరుడు లయ కారకుడని తెలిసిందే. ఆధ్యాత్మికతకు నెలవైన మన దేశంలో శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోయే అద్భుత ఆలయాలు! ప్రపంచంలోనే ప్రత్యేకమైన కదిలే శివలింగం!నమ్మలేని నిజం
మన దేశం ఆధ్యాత్మికతకు నెలవు. ఇక్కడ ఎన్నో పుణ్య క్షేత్రాలు కొలువై ఉన్నాయి. అందులో ఎక్కువగా కనిపించే దేవాలయాలు శివుడివి. ఎందుకంటే మనకు పురాణాల ప్రకారం శివుడు మొదటి దేవుడు. ఇక హిందువుల ఆరాధ్య దైవం కూడా శివుడు కావడం విశేషం. 'శివమ్' అంటే శుభం అని, లింగం అంటే సంకేతం అని అర్థం. శివలింగం అంటే శుభానికి సంకేతం అని అర్థం. ఈ ప్రపంచంలో ఎన్నో శివలింగాలు ఉన్నాయి. అందులో కొన్ని మనుషులు ప్రతిష్టించినవి అయితే, మరి కొన్ని వాటంతట అవే స్వయంభువుగా వెలిసినవి. వీటిల్లో ఒక శివలింగం మాత్రం చాలా ప్రత్యేకమైనది! ఈ శివలింగం ప్రత్యేకత ఏమిటో తెలుసా! ఈ శివలింగం కదులుతుంది! ఇలాంటి విషయం ఇంతకు ముందు ఎప్పుడూ వినకపోయినా చూడకపోయినా నమ్మి తీరాల్సిందే! ఎందుకంటే ఇది నిజం.కదిలే శివలింగ ఎక్కడుందో తెలుసా! శివలింగం ఏంటి కదలటం ఏంటి అని ఆశ్చర్యపోతున్నారా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది వాస్తవం! ఇక్కడి కోవెలలో శివలింగం ఒక్కసారి కదలడం ప్రారంభిస్తే ఏకధాటిగా 24 గంటలు కదులుతుంది. ఒకసారి ఆగితే ఇక ఎంత కదిపినా కదలదు. ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉత్తరప్రదేశ్ లోని దియోరియా జిల్లాలో ఉంది. ఇక్కడి శివుడిని దుగ్దేశ్వరనాథుడని అంటారు. ఆలయ స్థల పురాణం ప్రకారం మధ్యప్రదేశ్ లో ఉన్న మహాకాళేశ్వర జ్యోతిర్లింగానికి ఇది ఉపలింగం అని అంటారు. ఈ అద్భుతమైన ఆలయం గురించి మరిన్ని విశేషాలు ఇప్పుడు తెలుసుకుందాం.రుజువైన నిజం
మన దేశంలోని ఆలయాలు ఛేధించలేని మిస్టరీలకు నిలయమని మరోసారి రుజువు చేస్తుంది దియోరియాలోని రుద్రపురంలో ఉన్న ఈ శివాలయం. ఇక్కడి శివాలయం లోని శివలింగం పానవట్టం మీద కాకుండా సరాసరి భూమి మీదనే ప్రతిష్టించబడి ఉండడం విశేషం. రెండువేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయం ఒక అద్భుతానికి ఆలవాలం. ఈ ఆలయంలో శివలింగం అనూహ్యంగా అనేక సార్లు కదులుతుంది. అలా ఒక్కోసారి ఒక గంట సేపు కదలచ్చు, లేదా ఐదు గంటలు కదలచ్చు. ఒక్కోసారి రోజంతా నిర్విరామంగా ఇరవై నాలుగు గంటల సేపు కూడా కదులుతూనే ఉంటుందని స్థానికులు, అర్చకులు చెబుతారు. అలాంటి సమయంలో స్వామివారిని చూడటానికి భక్తులు తండోపతండాలుగా కదిలి వస్తుంటారట. ఇలా కదిలిన శివలింగంలోని కదలిక ఒకసారి ఆగిపోయాక ఎవరు ఎంత కదిపినా ఒక్క అంగుళం కూడా కదలదట. ఇదే ఇక్కడి వింత.ఎంత తవ్వినా జడ తెలియని వైనంఈ లింగం భూమి లోపలకి ఎంత లోతు వరకు ఉందో తెలుసుకోవటానికి ఎంత త్రవ్వినా ఆ జాడ కూడా తెలుసుకోవడంలో విఫలమయ్యరట. ఆశ్చర్యపోతున్న శాస్త్రవేత్తలు సైతం ఈ వింతను చూసి ఆశ్చర్యపోయారట!శివలీల అంటే ఇదే!
రెండువేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో శివలింగం ఎన్నో సందర్భాలలో కదలడం చాలా ప్రత్యేకత! ఈ సంఘటనను చూడటానికి భక్తులు తండోప తండాలుగా తరలివస్తుంటారు. ఈ చిత్రమైన సంఘటనను ఎలాగైనా కనిపెట్టాలని శాస్త్రవేత్తలు శివలింగం చుట్టూ ఎంత తవ్వినా దాని జాడ తెలియడం లేదట! దానితో ఇక్కడ సాక్షాత్తు పరమ శివుడే వెలిశాడని భక్తుల నమ్మకం.చూసే అదృష్టం ఉండాలేగాని ఇలాంటి అబ్బురపరిచే దేవాలయాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా ఈ ఆలయాన్ని దర్శించాలని అనిపిస్తోంది కదా!మనం కూడా తప్పకుండా ఈ శివాలయాన్ని దర్శించి ఈ మహిమను కనులారా వీక్షిద్దాం.ఓం నమః శివాయ!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

## కులదేవత, ఇష్టదేవత మధ్య తేడాలేంటి?



హిందూ మతంలో ఎంతో ంది దేవుళ్లు, దేవతల ప్రస్తావన ఉంది. అందులో కులదేవత, ఇష్టదేవత అంటే ఎవరు? గ్రామ దేవత, క్షేత్రపాలకుడి మధ్య తేడాలేంటి? కుటుంబాలు, కొన్ని సమూహాలు ఒక దేవుడిని పూజిస్తే, గ్రామం మొత్తం మరో దేవతను, ఇంకా ఆలయాల్లో అనేక దైవాలను పూజిస్తుంటారు. ఈ దైవాలందరూ ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా, సంప్రదాయ పరంగా పూజలు అందుకుంటుంటారు.కులదేవత (లేదా కులదేవి)ఒక వంశం లేదా కులానికి అధిష్టాన దైవం. హిందూ సంస్కృతిలో, ప్రతి కుటుంబంలోనూ కులదేవతకు అత్యంత గౌరవనీయమైన స్థానం ఉంటుంది. 'కులదేవత' అనే పదం 'కులం' (వంశం), 'దేవత' (దైవం) అనే పదాల కలయికతో ఏర్పడింది. ఈ దైవిక రక్షకుడు వంశ పారంపర్యానికి రక్షకుడిగా ఉంటాడు. కులదేవతను ఆరాధించడం అంటే పూర్వీకులను గౌరవించడం, కుటుంబంపై ఉన్న దైవిక రక్షణను గౌరవించడం అని అర్థం. ప్రతి గోత్రం లేదా వంశానికి ఒక ప్రత్యేక దైవం ఉంటారు. వీరు హనుమంతుడు, భైరవుడు లేదా దుర్గాదేవి రూపాలు కావచ్చు. వివాహాలు లేదా ముఖ్యమైన జీవిత ఘట్టాలకు ముందు జరిపే పూజలు, కార్యక్రమాలు, వంశాభివృద్ధి కోసం ఈ దైవం ఆశీస్సులు కోరడంతోనే ప్రారంభమవుతాయి.వివాహాలు, నామకరణం, గృహప్రవేశం వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు ముందు కులదేవతలను పూజించాలి. కార్యక్రమాన్ని దైవిక ఆశీస్సులతో ప్రారంభించాలి. పండుగల్లాంటి ప్రత్యేక రోజుల్లో దీపం వెలిగించాలి.వినాయక విగ్రహం పెట్టాలనుకుంటున్నారా? – 'ఇలాంటిదైతే' ధనలాభం ఉంటుందంటున్న జ్యోతిషులు!ఇష్టదేవత – వ్యక్తిగత అనుబంధంఇష్టదేవత అంటే వ్యక్తిగత దైవం అని అర్థం. దైవంతో ఆత్మకు ఉండే ప్రత్యేక అనుబంధం. కృష్ణుడు, దుర్గ, గణేశుడు లేదా శివుడు వంటి దైవ రూపాలతో ఆకర్షణ లేదా అనుబంధం పెంచుకోవడమే ఇష్టదేవతగా చెప్పుకోవచ్చు. ఒక వ్యక్తి ఎవరితోనైతే గాఢమైన ఆధ్యాత్మిక సంభాషణను ఏర్పరచుకుంటారో ఆ దైవం. వ్యక్తి చైతన్యం విస్తరించే కొద్దీ ఇష్టదేవత మారవచ్చు, కాబట్టి ఈ అనుబంధం చాలా వ్యక్తిగతమైనది, ఆత్మ ఉద్ధరణకు దోహదపడేది. ఇష్ట దేవతలందరికీ నిర్దిష్టమైన మంత్రాలు ఉంటాయి. వాటిని జపించడం ద్వారా బంధం మరింత బలపడుతుంది. మీరు మీ కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లే వారితో మాట్లాడండి, మీ ఆశలను, కలలను పంచుకోవడం ద్వారా ప్రసన్నం చేసుకోవచ్చు.గ్రామ దేవత–గ్రామ సంరక్షకుడుగ్రామ దేవత ఒక గ్రామానికి లేదా నివాస ప్రాంతానికి మతపరమైన సంరక్షకుడు. కులదేవతలా కాకుండా, గ్రామ దేవత ఏ ఒక్క కుటుంబానికీ ప్రత్యేకం కాదు. ఒక నిర్దిష్ట గ్రామం లేదా ప్రాంతానికి చెందిన వారి సంప్రదాయం ఈ భావనలో అంతర్గతంగా ఉంటుంది. గ్రామాలు ఎంత చిన్నవైనా సంరక్షక దేవతను ఏర్పాటు చేసుకుంటారు. ప్రతి గ్రామంలో ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, గంగమ్మ, మైసమ్మ ఉంటారు. లింగమంతుల స్వామి, భైరవుడు, కాటమయ్య ఇలా పూజలందుకుంటుంటారు. గ్రామాల్లో ప్రబలే అంటువ్యాధులను దూరంగా ఉంచుతారని, వర్షాలు కురిపిస్తారని, తాము నివసించే ప్రాంతం, గ్రామాలకు రక్షణ కల్పిస్తారని నమ్ముతారు. పండుగలు, జాతరల ద్వారా సామూహికంగా మొక్కులు చెల్లించుకుంటారు. జంతు బలి, కొబ్బరికాయలు, పువ్వులు, పసుపును సమర్పిస్తారు.క్షేత్రపాలకుడు–పవిత్ర భౌగోళిక ప్రాంత సంరక్షకుడుక్షేత్రపాలకుడు అనే పదానికి అక్షరాలా 'ప్రాంత సంరక్షకుడు' అని అర్థం. ఇది సంస్కృత పదాలైన 'క్షేత్ర' (అంటే ప్రాంతం లేదా క్షేత్రం) 'పాల్' (సంరక్షకుడు) నుంచి వచ్చింది. పవిత్ర ప్రాంతాన్ని, ఆలయం సరిహద్దులను ప్రతికూల శక్తుల నుంచి సురక్షితంగా కాపాడడం ఈయన విధి. ప్రాచీన దేవాలయాల్లో క్షేత్రపాలకుని మందిరాలు ప్రత్యేకంగా ఉంటాయి. దైవత్వం మొదట రక్షిస్తుంది, ఆ తర్వాతే ప్రవేశానికి అనుమతిస్తుందని చెప్తుంటారు.అగరుబత్తీలు వెలిగించడం, ఆవనూనె సమర్పించడంతో పాటు ఆలయం లోపలికి వెళ్లే ముందు మందిర ప్రవేశద్వారం వద్ద ఉండే ద్వార పాలకులు, క్షేత్రపాలకులకు నమస్కరించాలి.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

## దుస్తుల శుభ్రత కోసం సర్ఫ్ ఎక్కువ వాడుతున్నారా?



దుస్తులు బాగా శుభ్రమవుతాయన్న అపోహతో చాలామంది వాషింగ్? మెషీన్?లో పరిమితికి మించి లిక్విడ్లు, పౌడర్లు, సర్ఫ్ వేసేస్తారు. ఈ అతి వినియోగమే మిషన్ దెబ్బతినడానికి, దుస్తులు పాడవడానికి, చర్మ సంబంధిత వ్యాధులకు కారణమవుతోంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెషీన్?తో పాటు మన ఆరోగ్యం కూడా పది కాలాల పాటు మన్నికగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.రసాయనాలతో జాగ్రత్త : దుస్తులు వేశాక, వాషింగ్ మెషీన్?లో పౌడర్లు, సోడాలు వంటివి చేత్తో వేస్తున్నారు. వాటిల్లో కొన్నింటికి మండే గుణం కలిగి అవి చేతి మీద వేసుకోగానే చర్మంపై బొబ్బలు వస్తాయి. కోసుకుపోయినట్లు గాయలవుతాయి. అదే విధంగా చర్మం పొట్టుపొట్టుగా ఊడిపోతుంది. మండుతుంది. ఈ స్థితిని ఎలర్జిటిక్ డెర్మటైటిస్ అంటారు. ఇలా జరక్కుండా రసాయనాలను నేరుగా చేత్తో కాకుండా గ్లౌవ్‌లు ధరించి వేయాలి.డిటర్జెంట్ ఎక్కువైతే అనర్థాలే! : అవసరానికి మించి వాడితే అధిక డిటర్జెంట్ అవశేషాలు దుస్తుల పోగుల మధ్య ఉండిపోతాయి. ఇవి చర్మాన్ని తాకినప్పుడు దురద, చికాకు, ఎలర్జీ, దద్దుర్లకు దారితీస్తాయి. కెమికల్స్ ఎక్కువ వాడడం వల్ల దుస్తుల రంగు త్వరగా వెలిసిపోతుంది. వీటిని మిషన్?లో వేస్తే లోపల , అవశేషాలు పేరుకుపోయి బూజుపడుతుంది. దీంతో మిషన్ పాడైపోతుంది.వాషింగ్ మిషన్ ఉన్నవాళ్లు, అది లేనివాళ్లు దుస్తుల శుభ్రతకు అనేక సర్ఫు, సోడాలు, రసాయనాలు వేస్తారు. వాటిపై అవగాహన కొరవడి ఇష్టానుసారం ఇలా చేస్తారు. దీనివల్ల దుస్తులు బాగా శుభ్రమవుతాయని అనుకుం టారు. ఆ వేసేవి దుస్తులపై పేరుకుపోయి చర్మ సంబంధిత వ్యాధులకు దారితీస్తాయి. ఏదీ పరిమితికి మించి వేయకూడదు. కొందరు వాటిని చేతులతో పట్టుకుంటారు. వాటికి మండే గుణం ఉంటుంది. ఇవి స్కిన్?కు ఇరిటేట్ అయ్యే పదార్థాలు. అందువల్ల నేరుగా చేతులతో హ్యాండిల్ చేయకూడదు. సాధ్యమైనంత వరకు గ్లౌవ్ ధరించాలి. – ఆచార్య ఇందిర, అసోసియేట్ ప్రొఫెసర్?, చర్మ వ్యాధుల విభాగం, ఏలూరు బోధనాసుపత్రి
డిటర్జెంట్ సరైన కొలతలు! : మిషన్?లో సగం వరకు దుస్తులు ఉంటే కేవలం రెండు టేబుల్ స్పూన్ల డిటర్జెంట్ పొడి, 30 నుంచి 60 ఎంఎల్ లిక్విడ్ డిటర్జెంట్ వేసుకుంటే సరిపోతుంది. అదే బాగా మురికిపట్టి ఉంటే 3 నుంచి 4 స్పూన్ల పొడి లేదా 90 ఎంఎల్ లిక్విడ్ వాడొచ్చని నిపుణులు చెబుతున్నారు. దుస్తులు ఉతికిన తర్వాత డిటర్జెంట్ వాసన వస్తుంటే దాని మోతాదును ఒక 20-25 శాతం తగ్గించాలని అర్థం.మన నివాస ప్రాంతంలో ఉండేది హార్డ్ వాటర్ అయితే డిటర్జెంట్ కొంచెం ఎక్కువ అవసరమవుతుంది. మంచినీరు అయితే తక్కువ డిటర్జెంట్ సరిపోతుంది.
ప్రస్తుతం మార్కెట్లో టాప్?లోడ్, ఫ్రంట్ లోడ్ రెండు రకాల వాషింగ్ మెషిన్లు ఉన్నాయి. ఏవి తీసుకున్నా తక్కువ శబ్ధం చేసేవి, తేమ త్వరగా బయటకు పోయి తుప్పు పట్టనివి ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
ఇంట్లో మిషన్? చెడిపోతే తలెత్తే ఇబ్బందులు మామూలుగా ఉండవు. ఇంటినిండా బట్టలు పేరుకుపోతాయి. అలా అని దాన్ని పునరుద్ధరించాక ఒకేసారి వాటిని మిషన్?లో పడేయకూడదు. మిషన్ సామర్థ్యానికి మించి బట్టలు వేయకూడదు. ఎక్కువ దుస్తులు వేస్తే మోటారు బెల్ట్?పై తీవ్రమైన ఒత్తిడి పడి త్వరగా పాడవుతాయి. ఆపై శుభ్రంగా క్లీన్ కావు. పరిమిత సంఖ్యలోనే ఉతకడం అన్నింటికి సురక్షితంచీఉజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# రెవెన్యూ సేవలుపై ప్రజలు సంతృప్తి స్థాయిని మరింత పెంచాలి

- **రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశంలి ...**



**ఏలూరు, అక్టోబరు 03:** జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో శనివారం రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాలు, పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్కు, ఐవిఆర్ఎస్ కాల్స్, స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాలు, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, తదితర రెవిన్యూ పరమైన అంశాలుపై " రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్" జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి రెవెన్యూ అధికారి యం.ముక్కంటి, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న లు పాల్గొన్నారు. ఒక్కొక్క అంశం మీద మండలాలు వారీగా సుదీర్ఘంగా సమీక్షించి, ప్రగతి సాధించ లేకపోయిన అధికారులు వివరణలుపై జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఒక్కొక్క అంశానికి టార్గెట్స్ పెట్టి, పది రోజుల్లోగా ప్రగతిని చూపించాలని అన్నారు.ఇకనుండి మూడు నెలలకు ఒక్కసారి రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసి ఒక కాఫీని అందించాలని తహాశీల్దార్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాలు, పిజిఆర్ఎస్, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టందని, అందుకు అనుగుణంగా లక్ష్యాలు సాధించుటలో అధికారులు సమన్మయంతో, సమర్ధవంతంగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్. దేవకీదేవి, ఆర్డీవోలు కె.లక్ష్మీప్రసన్న, యం.వి. రమణ, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, తహాశీల్దార్లు, డివిజనల్, మండల సర్వేయర్లు, జిల్లా కలెక్టరేటు వివిధ విభాగాలు సూపర్డెండులు, తదితరులు పాల్గొన్నారు

# పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్



**ఏలూరు, అక్టోబర్ 3 :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో, ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఏలూరు పట్టణం లోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీసు మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోలీసు యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లోపలికి రావడానికి, తిరిగి బయటకు వెళ్లానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఉండేలా అధికారులకు తగిన సూచనలు, సలహాలు జారీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేవారు మరియు రౌడీ షీటర్లపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు హెచ్చరించారు. గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇప్పటికే దాదాపు 60 శాతం పోలింగ్ స్టేషన్ల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు.ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ గారు కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు ఏలూరు డీఎస్పీ శ్రీ డి. శ్రావణ్ కుమార్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ, టూ టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, వన్ టౌన్ ఎస్సై సుధాకర్, టూటౌన్ ఎస్సైలు మధు వెంకట రాజా, రామకృష్ణ మరియు ఇతర పోలీస్, రెవెన్యూ/ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడి ఉత్సవాలలో సేవా సంకల్ప అభియాన్



**కామవరపుకోట, అక్టోబర్ 3 :** గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అంగన్వాడిలా ద్వారా అందించే సేవలను గర్భవతులు బాలింతలు తల్లులు సద్వినియోగం చేసుకోవాలని
సిడిపిఓ బ్యూలా అన్నారు కామవరపుకోట మండలం రామన్నపా లెం అంగన్వాడి కేంద్రంలో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించి అంగన్వాడి కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు మద్దిపాటి నాగేశ్వరరావు బిజెపి మండల అధ్యక్షులు సూర్యనారాయణ రాజు జిల్లా కమిటీ మెంబర్ మహిళా మోర్చా మహాల క్ష్మి మండల మహిళా మోర్చా మాధవి బలవర్ధన రాజు మురళీ వర్మ ఘంటా సురేష్ సత్యనారా యణ వి.సత్యనారాయణ వెంకటరమణ రాంబా బు తదితరులు పాల్గొన్నారు

# నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాల్సిందే ఎందుకంటే.



మంచి నిద్ర శరీరం, మెదడు ఆరోగ్యానికి ఎంతో అవసరం. అయితే ఒత్తిడి, ఎక్కువ పని గంటలు, రాత్రివేళల్లో డిజిటల్ తెరలను ఎక్కువగా చూడడం, క్రమం లేని జీవనశైలి వంటి కారణాలతో చాలామందికి నిద్ర సరిగా పట్టడం లేదు. నడక వంటి సాధారణ వ్యాయామాలు నిద్రకు మేలు చేస్తాయని తెలిసిందే. అదే సమయంలో కండరాలపై ఒత్తిడి కలిగించే బలవర్ధక వ్యాయామాలు కూడా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయని నిపుణుల అభిప్రాయాలు సూచిస్తున్నాయి. బరువులు ఎత్తడం, శరీర బరువుతో చేసే వ్యాయామాలు, వ్యాయామ పరికరాలు లేదా నిరోధక పట్టీలతో చేసే సాధనలు ఇందులోకి వస్తాయి. బలవర్ధక వ్యాయామాలు చేస్తే.. క్రమం తప్పకుండా బలవర్ధక వ్యాయామాలు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా మారుతుంది. వ్యాయామం రోజువారీ ఉద్రిక్తతను తగ్గించడంతో పాటు మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీనివల్ల రాత్రి నిద్రకు ఉపక్రమించినప్పుడు మనసు ప్రశాంతంగా ఉండే అవకాశం ఉంటుంది. అదే సమయంలో కండరాలు పనిచేయడం వల్ల శరీరానికి సహజమైన అలసట ఏర్పడి నిద్రకు ఉపకరిస్తుంది. క్రమబద్ధమైన వ్యాయామం నిద్ర నాణ్యత, నిద్ర వ్యవధిలో మెరుగుదలకు కూడా దోహదపడుతుంది. అయితే ఎక్కువసేపు లేదా అధిక తీవ్రతతో వ్యాయామం చేస్తేనే నిద్ర బాగా వస్తుందనేది కాదు. శరీరాన్ని పూర్తిగా అలసిపోయేలా చేయడం కంటే వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేయడం ముఖ్యమని సూచనలు చెబుతున్నాయి.తక్కువ స్థాయిలో ప్రారంభించాలి..బలవర్ధక వ్యాయామాలను ప్రారంభించేవారు తొలుత తక్కువ స్థాయి సాధనతో మొదలుపెట్టి, శరీరం అలవాటు పడుతున్న కొద్దీ క్రమంగా తీవ్రతను పెంచుకోవాలి.బరువులు ఎత్తడం, శరీర బరువుతో చేసే వ్యాయామాలు, వ్యాయామ పరికరాలు లేదా నిరోధక పట్టీలతో చేసే సాధనలు ఇందులోకి వస్తాయి. బలవర్ధక వ్యాయామాలు చేస్తే.. క్రమం తప్పకుండా బలవర్ధక వ్యాయామాలు చేయడం సరైన పద్ధతిలో వ్యాయామాలు చేయడం ముఖ్యం. కాళ్లు, వీపు, ఛాతీ, భుజాలు, చేతులు, పొత్తికడుపు భాగాలకు సంబంధించిన కండరాలకు వ్యాయామం అందేలా సమతుల్యమైన సాధనను ఎంచుకోవాలి. వ్యాయామం తర్వాత కండరాలకు కోలుకునేందుకు తగిన విశ్రాంతి ఇవ్వాలి. నడక, సైక్లింగ్ వంటి ఇతర మితమైన శారీరక కార్యకలాపాలను కూడా దీనితో కలిపి చేయవచ్చు. అయితే నిద్ర సమస్యలకు వ్యాయా మం ఒక్కటే పరిష్కారం కాదు. ఒత్తిడి, కొన్ని ఆరోగ్య సమస్యలు, మందులు, కెఫీన్, మద్యం, పని వేళల్లో మార్పులు, క్రమం లేని నిద్ర సమయం వంటి అనేక అంశాలు నిద్రను ప్రభావితం చేస్తాయి

# శరీరంలో జీవక్రియలు మందగించినప్పుడు కనిపించే లక్షణాలు ఇవే ఏం చేయాలంటే




బరువు, ఆరోగ్యం, శారీరక దారుఢ్యం గురించి మాట్లాడేటప్పుడు మెటబాలిజం లేదా జీవక్రియ అనే పదం తరచూ వినిపిస్తుంది. మనం తీసుకునే ఆహారంలోని పోషకాలను శరీరం శక్తిగా మార్చుకుని, అవసరమైన శారీరక కార్యకలాపాలకు ఉపయోగించుకునే ప్రక్రియనే జీవక్రియ. వయసు, లింగం, శరీరంలో కండరాలు–కొవ్వు నిష్పత్తి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, హార్మోన్ల పనితీరు వంటి అనేక అంశాలు జీవక్రియను ప్రభావితం చేస్తాయి. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం వంటివి జీవక్రియ సక్రమంగా పనిచేయడానికి సహాయపడతాయి.ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..అయితే కొన్ని కారణాల వల్ల జీవక్రియ మందగించినప్పుడు శరీరం కొన్ని సంకేతాలను చూపించదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు . బరువు పెరగడానికి ముందే శరీరం కొన్ని హెచ్చరిక సంకేతాలను అందిస్తుందని వారు పేర్కొంటున్నారు. ఉదయం నిద్రలేచిన వెంటనే అలసటగా అనిపించడం, మెదడు మందగించినట్లు లేదా ఆలోచనలు స్పష్టంగా లేకపోవడం, రోజంతా చురుకుగా ఉండడానికి పలుమార్లు కాఫీ అవసరమవడం వంటి లక్షణాలను గమనిస్తూ ఉండాలి. అలాగే తరచూ మలబద్ధకం ఉండడం, ఇతరులతో పోలిస్తే ఎక్కువగా చలిగా అనిపించడం, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం, సాధారణంగా జీవితం పట్ల ఉత్సాహం లేదా సంతోషం తగ్గినట్లు అనిపించడం వంటి మార్పులు కూడా కనిపిస్తాయని వారు తెలిపారు.ప్రారంభంలోనే గుర్తించాలి..ఈ సంకేతాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సమస్యకు కారణమేమిటో తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. జీవక్రియలో సమస్యలు ఏర్పడడం నిజమైన పరిస్థితేనని, సరైన ఆహారం, అవసరమైన పోషక మద్దతుతో దాన్ని నియంత్రించవచ్చని వారు తెలియజేస్తున్నారు. అయితే ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన జీవక్రియ మందగించిందని నిర్ధారించలేమని గమనించాలి. శరీరంలో ఇలాంటి మార్పులకు ఇతర కారణాలు కూడా ఉండే అవకాశం ఉంది. అందువల్ల లక్షణాలు నిరంతరం కొనసాగితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్య సలహా తీసుకోవడం అవసరం.జీవక్రియకు సంబంధించిన మార్పులు ఎప్పుడూ బరువు పెరగడం రూపంలోనే కనిపించాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు పేర్కొన్నారు. ఉదయం లేవగానే అలసట, తరచూ మలబద్ధకం, చలి, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం వంటి మార్పులను సాధారణ సమస్యలుగా భావించి పక్కన పెట్టకుండా శరీరం అందించే సంకేతాలుగా గమనించాలని సూచించారు. ఈ మార్పులను ముందుగానే గుర్తించి ఆహారం, నిద్ర, శారీరక చురుకుదనం వంటి జీవనశైలి అంశాలపై శ్రద్ధ పెట్టడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా చూసుకునే అవకాశం ఉంటుందని వారు తెలియజేస్తున్నారు.

# గడువు ముగిసిన వీసాలతో ఉన్న విదేశీయుల గుర్తింపు, నిఘాను హైదరాబాద్ పోలీసులు ముమ్మరం చేశారు



- **అక్రమ నివాసాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రత్యేక సంయుక్త తనిఖీలు**
- **అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

**హైదరాబాద్:** వీసాల గడువు ముగిసిన తర్వాత, విదేశీ వ్యవహారాలు మరియు ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘించి భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను గుర్తించడానికి హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. ఆగస్టు 31, 2026 నుండి, హైదరాబాద్ నగర పోలీసులు ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్ (ఫారిన్నర్స్ మానిటరింగ్ సెల్) ఫారిన్నర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ స్థానిక శాంతిభద్రతల పోలీసులు మరియు ఐటీ సెల్‌తో సమన్వయంతో నగరం అంతటా సంయుక్త సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు విదేశీయుల వివరాలను సమగ్రంగా ధృవీకరించడం మరియు వీసా నిబంధనలను అమలు చేయడంపై దృష్టి సారిస్తాయి. అదనంగా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ మరియు విదేశీయులకు ఆతిథ్యం ఇవ్వడంతో ముడిపడి ఉన్న బాధ్యతల గురించి ప్రజలలో మరియు వసతి సౌకర్యాల నిర్వాహకులలో అవగాహన పెంచడం ఈ చొరవ యొక్క లక్ష్యం. ఇప్పటివరకు, ఈ తనిఖీల సందర్భంగా వీసా నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా నివసిస్తున్న 49 మంది విదేశీయులను గుర్తించి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిర్బంధ కేంద్రాలకు తరలించారు. వీరిలో 12 మందిని ఇప్పటికే వారి స్వదేశాలకు పంపించేశారు. మిగిలిన వారిని స్వదేశానికి రప్పించే ప్రక్రియ ప్రస్తుతం సంబంధిత అధికారుల సమన్వయంతో కొనసాగుతోంది. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన విదేశీయుల వివరాలు:టోలి చౌకి పోలీస్ స్టేషన్ -30లంగర్ హౌజ్ పోలీస్ స్టేషన్ -06 మెహదీపట్నం పోలీస్ స్టేషన్ 06 రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ 03 బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ 02 సైఫాబాద్ పోలీస్ స్టేషన్ 01 గూడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ -01 తనిఖీల సమయంలో వెలుగులోకి వచ్చిన చట్టవిరుద్ధ కార్యకలాపాలు: క్షేత్రస్థాయి తనిఖీలు మరియు విచారణల సందర్భంగా, కొంతమంది విదేశీయులు ఇమ్మిగ్రేషన్ ఉల్లంఘనలతో పాటు భారత చట్టాల ఉల్లంఘనలతో సహా పలు చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు పోలీసులు గుర్తించారు:
నకిలీ కరెన్సీ మరియు మోసపూరిత కార్యకలాపాలు: గడువు ముగిసిన వీసాలు కలిగిన కొంతమంది విదేశీయులు నకి లీ కరెన్సీ చలామణి మరియు మోసాలకు పాల్పడినట్లు కనుగొనబడింది. వారిపై చర్యలు తీసుకుంటున్నారు.గంజాయి (మాదకద్రవ్యాలు) స్వాధీనం:తనిఖీల సందర్భంగా, పోలీసులు ఒక విదేశీయుడి నుండి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆసుపత్రులలో అనువాదకులు/మధ్యవర్తుల పాత్రల దుర్వినియోగం: విద్యార్థి వీసాలపై భారతదేశానికి వచ్చి, ఆ తర్వాత వీసాల గడువు ముగిసిన కొందరు విదేశీయులు, ఆసుపత్రులను సందర్శించే విదేశీ రోగులకు అనువాదకులుగా మరియు మధ్యవర్తులుగా పనిచేస్తున్నట్లు కనుగొనబడింది. రోగుల నుండి అధిక రుసుములు వసూలు చేయడమే కాకుండా, వారు ఆసుపత్రి బిల్లులపై దాదాపు 15% కమీషన్ పొందుతున్నారని ఆరోపణలు వచ్చాయి.వేశ్యావృత్తి కార్యకలాపాలు: తనిఖీలలో విదేశీ మహిళలు వేశ్యావృత్తిలో పాల్గొంటున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా, పర్యాటక వీసాపై వచ్చి, గడువు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే ఉండిపోయిన ఒక కెన్యా జాతీయురాలు వేశ్యావృత్తిలో పాల్గొంటున్నట్లు కనుగొనబడింది.మాదకద్రవ్యాలదుర్వినియోగం: మత్తుపదార్థాలకు బానిసైన ఒక విదేశీయుడు, మత్తు కోసం దగ్గు మందులో ఆల్ప్రజోలామ్ మాత్రలు కలుపుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.అదనంగా, 2018 నుండి 2025 వరకు గడువు ముగిసిన విద్యార్థి వీసాలతో రాజేంద్రనగర్ ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న దక్షిణ సూడాన్‌కు చెందిన ముగ్గురు విదేశీయులు డ్రగ్ స్క్రీనింగ్‌లో గంజాయి వాడినట్లు తేలింది.ముఖ్య గమనిక: చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్‌లు, వీసాలు మరియు ఇతర అవసరమైన పత్రాలు కలిగి ఉండి, వీసా నిబంధనలు మరియు భారతీయ చట్టాలకు అనుగుణంగా భారతదేశంలో నివసిస్తున్న విదేశీయులను పోలీసులు స్వాగతిస్తారు. అయితే, అక్రమ నివాసం, వీసా ఉల్లంఘనలు మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాలను సహించరు; అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. గృహ యజమానులు మరియు హాస్టళ్లు, వసతి సౌకర్యాల నిర్వాహకులకు హెచ్చరికలు/సూచనలు: ఇళ్లు, ఫ్లాట్లు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు మరియు సర్వీస్ అపార్ట్‌మెంట్ల యజమానులతో సహా విదేశీయులకు వసతి కల్పించే వారందరూ ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి:వసతి కల్పించే ముందు విదేశీయుడి పాస్‌పోర్ట్, వీసా మరియు ఇతర పత్రాలను క్షుణ్ణంగా ధృవీకరించుకోవాలి.

ఫారం ఉపయోగించి విదేశీయుడి బసకు సంబంధించిన వివరాలను అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలి. చట్ట ప్రకారం అవసరమైన రికార్డులను నిర్వహించండి మరియు అధికారులు కోరినప్పుడు వారికి సమాచారాన్ని అందించండి.గడువు ముగిసిన వీసాలు, నకిలీ పత్రాలు లేదా అను మానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన ఏవైనా సంఘటనలు గమనించినట్లయితే, వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయండి.
వసతి కల్పించేవారికి సూచన:విదేశీయులకు వసతి కల్పించే ప్రతి ఒక్కరూ---వాణిజ్య ప్రయోజనాల కోసం అయినా లేదా ఇతరత్రా అయినా (ఇంటి యజమానులు, అద్దెదారులు, హోటళ్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు మొదలైనవి)---విదేశీయుల నమోదుకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. కార్డుదారులకు మరియు నేపాల్, భూటాన్ పౌరులకు వసతి కల్పించేవారు
కూడా వర్తించే చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

ఈ నిబంధనలను కేవలం ఒక లాంఛ నంగా పరిగణించవద్దని, వీటిని చట్టపరమైన బాధ్యతగా మరియు ప్రజారోగ్య, భద్రతా విషయంగా పరిగణించాల ని హైదరాబాద్ నగర పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తనిఖీలు

# కుక్క కరిచినా, గోళ్లతో గాయం చేసినా ఎంతో ప్రమాదకరం వెంటనే చికిత్స తీసుకోవాలి ఎందుకంటే



కుక్క కాటు లేదా గోళ్లతో చేసిన గాయం చిన్నదిగా కనిపించినా, రేబిస్ ప్రమాదం ఉన్నప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. రేబిస్ అనేది కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపించే వైరస్ వ్యాధి. ఒకసారి వ్యాధి లక్షణాలు కనిపించడం ప్రారంభమైన తర్వాత ఇది దాదాపు ప్రాణాంతకంగా మారుతుంది. అయితే జంతువు కరిచిన వెంటనే సరైన ప్రథమ చికిత్స, అవసరమైన రేబిస్ టీకా, ఇతర చికిత్సలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మానవుల్లో వచ్చే రేబిస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక్కల వల్లే వస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏడాది సుమారు 91 లక్షల జంతు కాటు ఘటనలు జరుగుతుండగా, వాటిలో మూడు వంతులకు పైగా కుక్కల వల్లే సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు చెబుతున్నాయి. అందుకే కుక్క కాటు లేదా అనుమానాస్పదంగా దాడి చేసిన వెంటనే చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం ప్రథమ చికిత్స చేయాలి..కుక్క కరిచిన వెంటనే ముందుగా గాయాన్ని కనీసం 15 నిమిషాల పాటు సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడగాలి. గాయాన్ని కేవలం తుడవడం లేదా కొద్దిసేపు నీటితో కడగడం సరిపోదు. ఇలా కడగడం వల్ల గాయంపై ఉన్న లాలాజలం, వైరస్ పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అందుబాటులో ఉంటే కడిగిన తర్వాత అయోడిన్ కలిగిన లేదా వైరస్‌ను నిర్వీర్యం చేసే ద్రావణాన్ని ఉపయోగించవచ్చు. అయితే గాయంపై కారం పొడి, మొక్కల రసాలు, ఆమ్లాలు, క్షారాలు లేదా ఇతర హానికరమైన పదార్థాలను రాయకూడదు. ఇవి రేబిస్‌ను నివారించకపోగా కణజాలానికి మరింత నష్టం కలిగిస్తాయి. గాయం చిన్నదిగా ఉన్నా వెంటనే ఆరోగ్య కేంద్రానికి లేదా యాంటీ రేబిస్ క్లినిక్‌కు వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలి. ఇలా జరిగితే ఇంకా జాగ్రత్త అవసరం..ప్రతి కుక్కను తాకిన సందర్భంలో రేబిస్ టీకా అవసరం ఉండదు. జంతువును తాకడం, ఆహారం పెట్టడం లేదా చెక్కుచెదరని చర్మంపై జంతువు నాకడం వంటి వాటిని సాధారణంగా రేబిస్ ప్రమాదంగా పరిగణించరు. చర్మంపై స్వల్పంగా చేసిన గాయాలు లేదా రక్తస్రావం లేకుండా చర్మం దెబ్బతిన్న సందర్భాల్లో గాయాన్ని కడిగి వెంటనే రేబిస్ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. చర్మాన్ని చీల్చేలా కాటు లేదా గోళ్ల గాయం ఉండడం, గాయపడిన చర్మం లేదా కళ్లు, నోటి వంటి శ్లేష్మ పొరలపై జంతువు లాలాజలం పడడం వంటి తీవ్రమైన పరిస్థితుల్లో గాయాన్ని శుభ్రం చేయడంతోపాటు వెంటనే రేబిస్ టీకా, అవసరమైన సందర్భాల్లో రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలి. ఇంతకుముందు రేబిస్ టీకా పూర్తి కోర్సు తీసుకున్నవారికి సాధారణంగా ఇమ్యూనోగ్లోబులిన్ అవసరం ఉండదు. టీకా ఎన్ని డోసులు, ఏ రోజుల్లో తీసుకోవాలనేది గతంలో టీకా తీసుకున్నారా లేదా, గాయం తీవ్రత, టీకా ఇచ్చే విధానం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించిన షెడ్యూల్‌నే పాటించాలి.

# శరీరంలో ఐరన్ మాత్రమే కాదు, ఇది తక్కువగా ఉన్నా అలసటగా ఉంటుంది ఏం చేయాలంటే



తరచూ అలసటగా అనిపించడం, నిద్ర సరిగా పట్టకపోవడం, రాత్రివేళ కాళ్లలో అసౌకర్యంగా అనిపించడం లేదా ఎప్పుడూ ఆందోళనగా ఉండడం వంటి లక్షణాలను చాలామంది ఒత్తిడికి కారణంగా భావిస్తుంటారు. అయితే శరీరంలో ఇనుము నిల్వలు తక్కువగా ఉండడం కూడా ఇలాంటి సమస్యలకు సంబంధం కలిగి ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అలసటతోపాటు ఆందోళన, రాత్రి వేళ కాళ్లలో అసహనం, జుట్టు రాలడం వంటి సమస్యలు ఉన్న మహిళలు తమ శరీరంలోని ఇనుము స్థాయిలను కూడా పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం కేవలం హిమోగ్లోబిన్ పరీక్షపై ఆధారపడకుండా ఫెరిటిన్ పరీక్ష చేయించుకోవడం ద్వారా శరీరంలో నిల్వగా ఉన్న ఇనుము గురించి మరింత సమాచారం తెలుసుకోవచ్చని చెబుతున్నారు. హిమోగ్లోబిన్, ఫెరిటిన్ రెండూ ఇనుముకు సంబంధించినవే అయినప్పటికీ వాటి పాత్రలు వేర్వేరుగా ఉంటాయి. హిమోగ్లోబిన్ శరీరం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇనుము పరిస్థితి గురించి సూచిస్తే, ఫెరిటిన్ శరీరంలో నిల్వగా ఉన్న ఇనుము పరిమాణం గురించి తెలియజేస్తుంది. అందువల్ల హిమోగ్లోబిన్ సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ శరీరంలోని ఇనుము నిల్వలు తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రోజంతా శరీరం అలసిపోయినట్లు అనిపించినా రాత్రివేళ మెదడు ప్రశాంతంగా లేకపోవడం, నిద్రకు ఇబ్బంది కలగడం వంటి లక్షణాలు కనిపిస్తే ఇనుము నిల్వల పరిస్థితిని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.
నిద్రపై ప్రభావం పడే అవకాశం..
శరీరంలో ఇనుము తక్కువగా ఉండడం నిద్రపై కూడా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ కాళ్లను కదిలించాలనే అసౌకర్యం కలిగించే రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్‌తో తక్కువ ఇనుము స్థాయిలకు సంబంధం ఉంటుందని పేర్కొంటున్నారు. మెదడు పనితీరులోనూ ఇనుము కీలక పాత్ర పోషిస్తుంది. డోపమైన్, సెరోటోనిన్ వంటి రసాయనాల తయారీలో శరీరానికి ఇది అవసరం. అయితే ఫెరిటిన్ స్థాయిని మాత్రమే చూసి నిర్ణయానికి రాకూడదని, శరీరంలో వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ ఉందో తెలుసుకోవడానికి సీఆర్‌పీ అనే రక్త పరీక్షతో కలిపి పరిశీలించడం ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని ప్రయోగశాలల్లో ఫెరిటిన్ స్థాయి 15 వరకు సాధారణంగా పరిగణించబడుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలు 75 లేదా అంతకంటే తక్కువ ఫెరిటిన్ స్థాయిలో ఇనుము చికిత్సను పరిగణించవచ్చని చెబుతున్నాయి.హిమోగ్లోబిన్ సాధారణంగా ఉన్నప్పటికీ కొంతమంది మహిళల్లో ఫెరిటిన్ స్థాయిలు తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.ఆపాదించకుండా వైద్యుల సలహాతో కారణాన్ని తెలుసుకోవడం ముఖ్యం.

# పోలీసు పహారా మధ్య స్కూల్ కమిటీ ఎన్నికలు





- 51 ఓట్లతో విజయం సాధించిన బొబ్బిలి డాన్ దివాకర్
- సార్వత్రిక ఎన్నికలను తలపించిన ఎస్ఎంసి చైర్మన్ పోరు
- గంటల తరబడి ఎండలో నుంచి ఓట్లు వేసిన ఓటర్లు
- చేతులు మారిన నగదు

**కామవరపుకోట, అక్టోబర్ 3 :** మండల కేంద్రం లోని హైస్కూలు స్కూల్ మేనేజ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు శనివారం పోలీస్ పహారా మధ్య జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరు వర్గాల వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభ్యర్థులను నిలబెట్టారు. ఒకరిపై ఒకరు పై చేయి సాధించడం కోసం ఈ ఎన్నికలు నిర్వహించారు. 29వ తేదీన కోరం లేక వాయిదా పడటం, ఇరు వర్గాల వారు పోటీ పడటం తో మరి ఎక్కడా లేనివిధంగా బ్యాలెట్ పద్ధతిలో పోటీ నిర్వహించారు. డాన్ దివాకర్ బొబ్బిలి, బొల్లుబోయిన ప్రసాద్ ఇద్దరు తెరమీద పోటీ పడినా వీరికి తెరవెనక డాన్‌కు ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, ప్రసాద్ కు కామవరపుకోటకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి మద్దతు పలకడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. టీడీపీలోనే రెండు వర్గాలకు చెందిన గ్రూపుల మధ్య పోటీ జరగడం, సాక్షాత్తు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షులు బడేటి చంటి జోక్యం చేసుకున్నా ఎన్నిక జరగడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్కంఠ పోరు కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. ఇరువర్గాలవారు నియోజకవర్గ స్థాయిలో తమ బలాబలాలను మోహరించడంతో పాటు శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం తెల్లవారు ఝాము వరకు నోట్లు పంచిపెట్టారు. కొందరికి అయితే ఇరువైపులా ఓటుకు రు. 3 వేలు అందాయంటే, ఏ స్థాయిలో డబ్బు పంపకాలు జరిగాయో తెలుసోంది. ఉదయం 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ అనంతరం పోలింగ్ కార్యక్రమం ప్రారంభించారు. హై స్కూల్ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ ఎన్నికలకు ఓటు వేసేందుకు మండుతున్న ఎండలో ఓటర్లు బారులు తీరారు 700 మంది పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో 449 మంది ఓట్లు వేయటానికి రావడం జరిగింది. అత్యంత ఉత్కంఠల మధ్య జరిగిన పోటీలో మేనేజ్మెంట్ చైర్మన్గా బొబ్బిలి డాన్ దివాకర్ విజయం సాధించారు. ప్రత్యర్థి బోల్లుబోయిన ప్రసాద్ కు 199 ఓట్లు రాగా, విజేతగా నిలిచిన డాన్ కు 250 ఓట్లు వచ్చాయి. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎస్ఎంసి చైర్మన్ ఎన్నికలలో 51 ఓట్లతో డాన్ విజయం సాధించడం పట్ల అభిమానులు సందడి చేశారు. అనంతరం విజయం సాధించిన డాన్ మాట్లాడుతూ రెండేళ్ల పాటు తాను స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎంతో అభివృద్ధి చేశానని.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తనకు మద్దతుగా నిలిచి మరోసారి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన అవకాశాన్ని వినియోగించుకుని హైస్కూలును జిల్లా స్థాయిలో ఉండేలా ప్రగతి సాధించడానికి కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా ఓటమి చెందిన బొల్లుబోయిన ప్రసాద్ మాట్లాడుతూ చిన్న వ్యక్తిపై పెద్దలందరూ కలిసి వైసీపీ మద్దతు తీసుకుని నన్ను ఓడించారని ఆరోపణ చేశారు. నైతిక విజయం నాదే అని తెలిపారు. ఇప్పటికే కామవరపుకోటలో టీడీపీ రెండు గ్రూపులు ఉన్నాయని కోడై కోస్తుండగా ఈ ఎన్నిక, వర్గపోరుతో రెండు వర్గాల మధ్య సమన్వయం లేదనేది తేటతెల్లమైంది. అది అంతిమంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగు దేశం, కూటమి పార్టీల విజయావకాశాలను ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు.

జంగారెడ్డిగూడెం సిఐ సుభాష్ నేతృత్వంలో తడికలపూడి ఎస్సై వల్లి పద్మ 22 మంది సిబ్బందితో కలిసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఖ

# పట్టాదారు పాస్ పుస్తకం రైతన్నకు వరం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



- పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి
- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు కృతజ్ఞతలు

**గజపతినగరం, అక్టోబర్ 3 :** పట్టాదారు పాస్ పుస్తకం రైతన్నలకు వరం వంటిదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామంలో శనివారం పల్లె పండుగ 3.0 కార్యక్రమం మరియు మీ భూమి మీ హక్కు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రతి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా దాదాపు రూ.1 కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రూ.38.10 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరగని అభివృద్ధి నేడు పల్లె పండుగ ద్వారా జరుగుతోందని, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. స్వర్ణ గ్రామం సిబ్బంది మరియు మండల స్థాయి అధికారులతో స్థానిక సమస్యలపై చర్చించారు.అనంతరం మీ భూమి – మీ హక్కు కార్యక్రమం ద్వారా 337 మంది రైతులకు నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 12 రకాల సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన నూతన పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తన బొమ్మను పాస్ పుస్తకాలపై వేసుకున్నారని, తాము అలా కాకుండా రైతుకు భద్రత కల్పించేలా పుస్తకాలు ఇస్తున్నామని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అనాలోచిత ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తమ ప్రభుత్వం రద్దు చేసిందని స్పష్టం చేశారు. ఈ నూతన పాస్ పుస్తకాల ద్వారా రైతులకు రావాల్సిన ప్రభుత్వ పథకాల నగదు నేరుగా వారి ఖాతాల్లోకి వస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, గడిచిన 28 నెలల్లో పెన్షన్ల కోసం రూ.78000 కోట్లు ఖర్చు చేశామని మంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో రూ.23 వేల కోట్ల పెట్టుబడులతో 13 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మండల అధికారులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# సామాన్య భక్తులే కేంద్రంగా ఉత్సవాల ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, వీఎంసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం, ఈవో వీకే శీనా నాయక్**



- వినూత్న కార్యాచరణతో సమగ్ర సౌకర్యాలు
- ఏఐ డిస్‌ప్లే బోర్డులు, చైల్డ్ ట్యాగ్స్, బూమ్ బ్యారియర్స్
- 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రం
- మొత్తం 3,500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు
- మూడు హోల్డింగ్ ఏరియాల్లోనూ భక్తులకు సౌకర్యాలు
- క్రౌడ్ అనలిటిక్స్ ద్వారా నిరంతర చర్యలు
- ఉత్సవాల విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం

**విజయవాడ, అక్టోబర్ 03, 2026 :** ఈ నెల 11వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20వ తేదీ ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు జరిగే దసరా మహోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో శీనా నాయక్.. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, దేవాదాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సంయుక్త తనిఖీలు నిర్వహించారు. సీతమ్మవారి పాదాలు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్లి ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించారు. భక్తులకు భద్రత, సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం కొండపై నలుగురూ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వినూత్న కార్యాచరణ రూపొందించామని, భక్తుల రాకపోకలు, దర్శనం, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్నిఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా జరగనుందని.. ఈ మేళాకు గౌరవ రాష్ట్రపతి కూడా రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ 2024 నుంచి టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యమిస్తూ వినూత్న ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని... ఈసారి కూడా మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్స్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేస్తున్నామ న్నారు. గౌరవ సీఎం వారి మార్గనిర్దేశం మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తామన్నారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాట్లు చేశామని.. 3,500 మంది సిబ్బందితో బందోబస్తు ఉంటుందని.. యంగ్ అండ్ డైనమిక్ పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారన్నారు. ఈసారి క్రౌడ్ అనలిటిక్స్‌కు ప్రాధాన్యమిస్తూ నిరంతర సమగ్ర ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వీఎంసీ ధ్యానచంద్ర.. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు.

ఈవో వీకే శీనానాయక్.. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

# ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ విద్యకు భరోసా

- ప్రశస్త యాప్ ద్వారా స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఎంఈవోలకు అవగాహన కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ




**విజయవాడ, అక్టోబర్ 03, 2026 :** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చిన్న వయసులోనే గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు, వసతులు కల్పిస్తూ సాధారణ పిల్లలతో సమానంగా విద్యను అభ్యసించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్య, గుర్తింపు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై జిల్లాలోని ఎంఈవో-1, ఎంఈవో-2లకు శనివారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఉపాధ్యాయులు చిన్న వయస్సులోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడంతో పాటు, వారు క్రమంతప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వైద్యం, పునరావాసం తదితర సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి భవిత సెంటర్‌లో సుమారు 20 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. భవిత సెంటర్ల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఐదు మున్సిపాలిటీలకు ఒక ఆటిజం సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 2,351 మందికి పైగా సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తోందని చెప్పారు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున, బాలికలకు రూ. 2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# పోషక విలువలతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం సీడీపీవో తార



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 30 :** పోషక విలువలున్న ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని బూర్గంపహాడ్ సీడీపీవో తార అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ రైతు వేదికలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీవో తార మాట్లాడుతూ పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తుందని, దీనిని తల్లులు, గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలన్నారు.పరిధిలోని మోరంపల్లిబంజర్ రైతు వేదికలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీవో తార మాట్లాడుతూ పౌష్టికా హారం ఆరోగ్యవంతంగా ఉంటారని బూర్గంప హాడ్ సీడీపీవో తార అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ రైతు వేదికలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారు లకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీవో గర్భిణులు, తల్లులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నగేష్, ఉప సర్పంచ్ పొక్కుల రవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

# భూరీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి కలెక్టర్ అంకిత్



**చుంచుపల్లి, సెప్టెంబర్ 30 :** భూరీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం చుంచుపల్లి మండలంలో పర్యటించిన ఆయన చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని 2,027 ఎకరాల 30 గుంటల భూమికి సంబంధించిన సర్వేను వేగవంతం చేసి, భూ సరిహద్దులు, రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మేధో వైకల్యం కలిగిన, పాఠశాలకు హాజరుకాలేని విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆదేశించారు. గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని 2,027 ఎకరాల 30 గుంటల భూమికి సంబంధించిన సర్వేను వేగవంతం చేసి, భూ సరిహద్దులు, గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని 2,027 ఎకరాల 30 గుంటల భూమికి సంబంధించిన సర్వేను వేగవంతం చేసి, భూ సరిహద్దులు, బుధవారం చుంచుపల్లి మండలంలో పర్యటించిన ఆయన చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని 2,027 ఎకరాల 30 గుంటల భూమికి సంబంధించిన సర్వేను వేగవంతం చేసి, భూ సరిహద్దులు, రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సిరాజ్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..

భారత్-వెస్టిండీస్ మూడో వన్డేలో మహ్మద్ సిరాజ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. రనౌట్ కోసం గుర్నూర్ బ్రార్ విసిరిన బంతి సిరాజ్ తలకు బలంగా తగిలేలా దూసుకొచ్చింది. ఆ సమయంలో సిరాజ్ నేలపై పడుకుని ఉండగా.. బ్రార్ వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతిని విసిరాడు. అయితే అదృష్టవశాత్తూ బంతి సిరాజ్ తలకు కొద్దిగా పైనుంచి వెళ్లిపోయింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన సిరాజ్.. ఏం జరిగిందో అర్థం కాక అలాగే చూస్తుండిపోయాడు. ఈ ఘటనను చూసిన రోహిత్ శర్మ నవ్వు ఆపుకోలేకపోయాడు. దీంతో మైదానంలో కాసేపు సరదా వాతావరణం నెలకొంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ వెస్టిండీస్ ముందు 352 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఆరంభంలో కోహ్లీ, గిల్ నిరాశపర్చినా.. రోహిత్, గైక్వాడ్ మ్యాచ్‌ను గాడిలో పెట్టారు. తర్వాత వచ్చిన రాహుల్ తనదైన శైలిలో ఆడుతూ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. ఈ క్రమంలో సెంచరీ పూర్తి చేసుకొని 129 పరుగుల వద్ద తన కెరీర్ బెస్ట్ స్కోర్‌ను నమోదు చేసుకున్నాడు. ప్రస్తుతం బౌలింగ్ చేస్తున్న భారత్.. వెస్టిండీస్‌ను కట్టడి చేసేందుకు శ్రమిస్తోంది. అద్భుతమైన బాల్‌తో క్యాంప్‌బెల్‌ను సిరాజ్ ఔట్ చేసినప్పటికీ.. జంగూతో కలిసి హోప్ ఇన్నింగ్స్‌ను బలంగా నిర్మిస్తున్నాడు. 15 ఓవర్లు పూర్తయ్యే సమయానికి వెస్టిండీస్ ఒక వికెట్ నష్టానికి 106 పరుగులు చేసింది.

# పాక్‌ను చిత్తు చేసిన భారత్..

## ఆసియా క్రీడల్లో స్వర్ణం నిలబెట్టుకున్న భారత్

## 20 బంతుల్లోనే అభిషేక్ శర్మ అర్ధశతకం

ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో 19 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ (61), తిలక్ వర్మ (51 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్ 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాక్ 192/6 స్కోరుకే పరిమితమైంది. హసన్ నవాజ్ (96 పరుగులు) ఒంటరి పోరాటం చేసినా.. పాక్‌ను గెలిపించలేకపోయాడు. హసన్ నవాజ్ చివరి బంతికి అవుటయ్యాడు.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 20 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. దీంతో పాక్‌పై టీ20ల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. గతంలో 2025లో దుబాయ్‌లో 24 బంతుల్లో సాధించిన తన రికార్డునే అధిగమించాడు. అభిషేక్ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. ఇందులో మూడు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత తిలక్ వర్మ తనదైన శైలిలో చెలరేగాడు. కేవలం 21 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. శివమ్ దూబేతో కలిసి ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. దీంతో భారత్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. 212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్‌కు హసన్ నవాజ్ అండగా నిలిచాడు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ 51 బంతుల్లోనే 96 పరుగులు చేశాడు. సైమ్ అయూబ్ (29) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసి పాక్ పరుగుల వేగానికి అడ్డుకట్ట వేశారు. చివర్లో శివమ్ దూబే కూడా రెండు వికెట్లు పడగొట్టడంతో పాక్ 20 ఓవర్లలో లక్ష్యానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా క్రీడల క్రికెట్లో మహిళల స్వర్ణం కూడా భారత్ ఖాతాలో చేరడం తెలిసిందే. ఇప్పుడు పురుషుల టీమ్ కూడా ఫైనల్లో గెలవడంతో క్రికెట్లో భారత్ గోల్డెన్ డబుల్ సాధించినట్టయింది.







# రెజ్లింగ్‌లో భారత్‌కు పసిడి

## - వరల్డ్ ఛాంపియన్‌ను ఓడించిన అమన్

రత రెజ్లర్ అమన్ సెహ్రావత్ ఆసియా క్రీడల్లో పసిడి పతకం సాధించాడు. శనివారం జరిగిన 57 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఈవెంట్‌లో అతడు నార్త్ కొరియా రెజ్లర్, వరల్డ్ ఛాంపియన్ హన్ చాంగ్ సంగ్‌ను 11-7 తేడాతో ఓడించి స్వర్ణం పట్టేశాడు. కాగా, అతడు 2023 హంగ్జౌ ఆసియా క్రీడల్లో ఇదే విభాగంలో బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నాడు. ఇక 2024 పారిస్ ఒలింపిక్స్‌లోనూ అమన్ కాంస్యం నెగ్గాడు. అలాగే ఈ విజయంతో అమన్ అరుదైన ఘనత సాధించాడు. ఆసియా క్రీడల 57 కేజీల ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గిన భారత తొలి రెజ్లర్‌గా రికార్డులకెక్కాడు. గతంలో ఏ అథ్లెట్ కూడా ఈ విభాగంలో భారత్‌కు పసిడి పతకం రాలేదు. మరోవైపు రెజ్లింగ్‌లోనే బ్రాంజ్ మెడల్ వచ్చే అవకాశం త్రుటిలో చేజారింది. ఇవాళ కాంస్య పతక పోరులో బరిలోకి దిగిన భారత రెజ్లర్ సాగర్ జగ్లాన్ ఓడిపోయాడు. 73 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో సాగర్ కజకిస్థాన్‌కు చెందిన రెజ్లర్ నుర్కోజా కైపోనవ్‌ను ఢీ కొట్టాడు. ఈ పోరులో 30 సెకన్లలోనే సాగర్ కిందపడిపోయి పరాజయం పాలయ్యాడు. దీంతో అతడికి కాంస్యం చేజారింది. భారత్‌కు ఇది నాలుగో గోల్డ్ మెడల్ కావడం విశేషం. ఈ ఈవెంట్‌కు ముందు భారత్ మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో కుంకుమ్ మహోద్ పసిడి ముద్దాడింది. దక్షిణ కొరియాకు చెందిన ఓ యెజిన్‌తో జరిగిన ఫైనల్లో 5- 5తో స్కోర్ సమమైనా షూట్‌ఔట్‌లో కంకుమ్ విజయం సాధించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే గోల్ఫ్‌లో మెడల్ వచ్చింది. మహిళా గోల్ఫర్ ప్రణవి ఉర్స్ స్వర్ణ పతకం అందుకుంది. ఇక పురుషుల క్రికెట్‌లోనూ భారత్ జట్టు కూడా గోల్డ్ మెడల్ సాధించింది. ఫైనల్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో శ్రేయస్



సేన నెగ్గింది. దీంతో ఆసియా క్రీడల్లో వరుసగా రెండోసారి టీమ్‌ఇండియా పసిడి పతకం ముద్దాడింది. 2023 హాంగ్జౌ క్రీడల్లోనూ భారత్‌కు స్వర్ణం వచ్చింది. కాగా, ప్రస్తుత విజయంతో ఈ క్రీడల్లో భారత్‌కు 20వ పసిడి పతకం వచ్చింది. ఓవరాల్‌గా ఇప్పటిదాకా 86 పతకాలు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఇందులో 26 రజతాలు, 36 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో కొనసాగుతోంది.

# విండీస్ ముందు భారీ లక్ష్యం!



వెస్టిండీస్‌తో ఆఖరి వన్డేలో టీమిండియా 352 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. కేఎల్ రాహుల్(87 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 129 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 351 పరుగులు చేసింది. రోహిత్ శర్మ(85 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 92) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు.రుతురాజ్ గైక్వాడ్(69 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. నమన్ ధీర్(21 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) పర్వాలేదనిపించాడు. వెస్టిండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్(3/62) మూడు వికెట్లు తీయగా.. కీమో పాల్(2/71) రెండు వికెట్లు పడగొట్టాడు. గుడకేష్ మోతీ ఒక వికెట్ తీసాడు.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. జైడెన్ సీల్స్ వేసిన మూడో ఓవర్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(1), విరాట్ కోహ్లీ(0) వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. గిల్ క్యాచ్ ఔట్ కాగా.. విరాట్ కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో భారత్ 4 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ జట్టును ఆదుకున్నారు. ఆచితూచి ఆడిన ఈ జోడీ తొలి పవర్ ప్లేలో 2 వికెట్లకు 28 పరుగులే చేసింది. పవర్ ప్లే అనంతరం రోహిత్ శర్మ దూకుగా ఆడాడు. ఈ క్రమంలో అతను 58 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. రుతురాజ్ గైక్వాడ్ కూడా బ్యాట్ ఝులిపించడంతో భారత్ 19.5 ఓవర్లలో 100 పరుగులు చేసింది.రుతురాజ్ గైక్వాడ్ 64 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రోహిత్ శర్మ సెంచరీ దిశగా సాగాడు. అయితే 92 పరుగుల వద్ద భారీ సిక్సర్ బాదే ప్రయత్నం చేసిన రోహిత్ శర్మ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి శతకాన్ని చేజార్చుకున్నాడు. కాసేపు నిదానంగా ఆడి ఉంటే హిట్ మ్యాన్ సెంచరీ పూర్తయ్యేది. కానీ కీమో పాల్ ఊరించే బౌన్సర్‌తో బోల్తా కొట్టించాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 137 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రోహిత్ ఔటైన వెంటనే రుతురాజ్ గైక్వాడ్ కూడా క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్, నమన్ ధీర్ దూకుడుగా ఆడారు. విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. రాహుల్ 41 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. నమన్ ధీర్(30) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. నితీష్ కుమార్ రెడ్డి(9) బంగారం లాంటి అవకాశాన్ని చేజార్చుకోగా.. అన్షుల్ కంబోజ్(17)తో కలిసి రాహుల్ జట్టును ముందుకు నడిపించాడు.కంబోజ్ 2 భారీ సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. అతను విఫలమైనా.. గుర్నూర్ బ్రార్ సాయంతో జట్టు స్కోర్‌ను 300 ధాటించిన రాహుల్... 80 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం మరింత ధాటిగా ఆడిన రాహుల్.. జట్టుకు 351 పరుగుల భారీ స్కోర్ అందించాడు.తుది జట్లు:వెస్టిండీస్: జాన్ క్యాంప్‌బెల్, జువెల్ ఆండ్రూ, షాయ్ హోప్ (వికెట్ కీపర్/కెప్టెన్), అమీర్ జాంగూ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, కీమో పాల్, మాథ్యూ ఫోర్డే, అల్జారీ జోసెఫ్, గుడాకేష్ మోటీ, జెడెన్ సీల్స్, విటెల్ లాప్స్‌భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అన్షుల్ కంబోజ్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.



# సన్ రైజర్స్ హైదరాబాద్‌లో కెప్టెన్సీ రగడ!

ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ అత్యంత నిలకడైన జట్టనే పేరుంది. గతంలో తమ బౌలింగ్‌తో 150 పరుగుల టార్గెట్‌ను కూడా చాలా సార్లు డిఫెండ్ చేసుకుంది. అయితే 2020 నుంచి సన్ రైజర్స్ ఆట గాడి తప్పింది. 2023 వరకు పేలవ ప్రదర్శన చేసింది. జట్టుకు పెద్దగా పాపులారిటీ కూడా కనిపించలేదు. అయితే 2024 నుంచి సన్ రైజర్స్ హైదరాబాద్ పేరు మార్మోగింది. దూకుడైన ఆటతో అదరగొట్టింది. ముఖ్యంగా అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, క్లాసెన్, ప్యాట్ కమిన్స్‌లు సన్ రైజర్స్‌కు ఎనలేని క్రేజ్‌ను తీసుకొచ్చారు. గత మూడు సీజన్లలో జట్టుకు విపరీతమైన ఫాలోయింగ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఫ్యాన్స్ ఏర్పడ్డారు. అయితే తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్‌లో ముసలం మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. డాషింగ్ ప్లేయర్ సన్ రైజర్స్ హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు కూడా వార్తలు వస్తున్నాయి. కెప్టెన్సీ విషయంలో సదరు ప్లేయర్ అసంతృప్తితో ఉన్నట్లు దాంతో అతడు జట్టును వీడేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి.ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో సన్ రైజర్స్ మొదట్లో ఆడిన మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేడు. దాంతో ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా.. అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ ఆకట్టుకున్నాడు. అయితే తనకు కాకుండా ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ ఇవ్వడంపై అభిషేక్ శర్మ గుర్రుగా ఉన్నట్లు సమాచారం.దాంతో అభిషేక్ శర్మ సన్ రైజర్స్ హైదరాబాద్‌ను వీడేందుకు సిద్ధమైనట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే ఇవన్నీ అవాస్తవాలు అంటూ సన్ రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ క్లారిటీ ఇచ్చినట్లు కూడా వార్తలు వస్తున్నాయి.అభిషేక్ శర్మ కెప్టెన్సీ విషయంలో నిజంగా అసంతృప్తిగా ఉంటే మాత్రం అది అతడి కెరీర్‌ను నాశనం చేసే అవకాశాలు ఉన్నాయి.

ఎందుకంటే ఇషాన్ కిషన్‌కు కెప్టెన్‌గా ఎంతో అనుభవం ఉంది. అభిషేక్ శర్మ అలా కాదు. ఇక ఆరెంజ్ ఆర్మీకి అభిషేక్ శర్మ అంటే ఎనలేని ప్రేమ. అతడు జట్టును వీడితే మాత్రం అది ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి.

ప్రస్తుతం అభిషేక్ శర్మకు విపరీతమైన క్రేజ్ ఉంది. ఇతర జట్లు అతడిపై భారీ డబ్బు పెట్టే అవకాశం కూడా ఉంది. అయితే కెప్టెన్సీని ఆఫర్ చేస్తుందా అనేది అనుమానమే. సన్ రైజర్స్‌లో అయితే అతడికి వైస్ కెప్టెన్సీ ఉంటుంది.



## రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని

కన్నడ స్టార్ హీరోయిన్, 'డింపుల్ క్వీన్'గా పేరుగాంచిన రచితా రామ్‌కు తన పుట్టినరోజు వేడుకల్లో ఒక అభిమాని నుంచి ఊహించని, ఆసక్తికరమైన అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఓ యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం కోపగించుకోకుండా చిరునవ్వుతో స్పందించి తన అభిమానుల మనసు గెలుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా రచితా రామ్ తన పుట్టినరోజును అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అక్టోబర్ 3న అర్ధరాత్రి నుంచే బెంగళూరులోని ఆర్ఆర్ నగర్‌లో ఉన్న ఆమె నివాసం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. ఆమె నటించిన పాత్రల భారీ కటౌట్లతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. అభిమానుల ప్రేమకు స్పందించిన రచిత, వారితో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ క్రమంలోనే ఓ యువకుడు సెల్ఫీ తీసుకున్న తర్వాత ఆప్యాయంగా ఆమె రెండు బుగ్గలను గిల్లాడు. ఈ అనూహ్య పరిణామానికి రచిత ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా, వెంటనే తేరుకుని నవ్వేశారు. అభిమాని అత్యుత్సాహాన్ని ఆమె సానుకూలంగా తీసుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

## 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేనట్లే..?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది.అయితే తాజాగా ఈ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి స్వయంగా స్పందించింది. తాను 'రాకా' సినిమాలో భాగం కాదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు, తనను ఎవరైనా ఈ సినిమాలో చేర్చాలని సరదాగా స్పందించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐశ్వర్య లక్ష్మి 'రాకా' తారాగణంలో లేరని భావించవచ్చు. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో భవిష్యత్తులో తారాగణానికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అట్లీ గతంలో భారీ కమర్షియల్ అంశాలతో సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు సమాచారం. సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు భాగం కానున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఒకటి కంటే ఎక్కువ కీలక మహిళా పాత్రలు ఉండనున్నాయని, వాటి కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే పూర్తి తారాగణంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను నిర్ధారించలేం.'రాకా' సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. కథ, నటీనటులు, సాంకేతిక విభాగం ఇలా ప్రతి విషయంలోనూ భారీగా ప్లాన్ చేస్తున్న ఈ సినిమా అల్లు అర్జున్ అభిమానుల్లోనే కాకుండా ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని పెంచుతోంది.



## 'ఎవ్వరినీ వదిలిపెట్టను'

### - 'చుట్టమల్లే' మార్ఫింగ్ వీడియోపై ఎన్టీఆర్ ఫైర్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను దుర్వినియోగం చేస్తూ క్రియేట్ చేసిన 'చుట్టమల్లే ' సాంగ్ మార్ఫింగ్ వీడియోపై స్టార్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. ఏఐని ఉపయోగించి ఇలాంటి పనులు చేయడాన్ని నీచమైన చర్యగా అభివర్ణించారు. ఇది అసహ్యకరమైన, రోత పుట్టించే సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. దీని వెనుక ఉన్న వాళ్లను ఎవరినీ వదిలిపెట్టబోనని హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'స్త్రీలను తల్లులుగా, దేవతలుగా పూజించే గడ్డ ఇది. ఈ 'మాతృదేవో భవ' అనేది ఒక మాట మాత్రమే కాదు. ఇది మన సంస్కృతిలో భాగం. అలాంటి ఈ గడ్డపై పుట్టిన కొందరు వ్యక్తులు, ఒక స్త్రీని అత్యంత నీచమైన రీతిలో అవమానించడానికి ఏఐని ఉపయోగించేలా దిగజారిపోయారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?ను ఇంతటి నీచమైన దాన్ని సృష్టించేందుకు ఉపయోగించడం మాటల్లో చెప్పలేనంత సిగ్గుచేటు. చుట్టమల్లె వీడియోను మార్ఫింగ్ చేసిన ఘటన వెనుక ఉన్న వాళ్లను ఎవ్వరినీ నేను వదిలిపెట్టను. దీన్ని సృష్టించిన వారిపై, సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. దయచేసి ఇలాంటి కంటెంట్‌ను చూడవద్దు, ఇతరులకు షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు ఒకరికి జరిగింది. రేపు మీ తల్లి, సోదరి, భార్య లేదా కుమార్తె కావచ్చు. ఇది ఒక తీవ్రమైన సమస్య. ఏఐ దుర్వినియోగం చేయకుండా కఠినమైన నిబంధనలను తీసుకురావాలని నేను రాష్ట్ర, భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాను' అని ఎన్టీఆర్ ఎక్స్?లో పోస్టు చేశారు. అయితే చుట్టమల్లే పాటను ఎవరో ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపైనే ఎన్టీఆర్ ఫైర్ అయ్యారు. ? కాగా, 2024లో వచ్చిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాట సూపర్ హిట్టయ్యింది. ఇందులో ఎన్టీఆర్- జాన్వీ కపూర్ డాన్స్ ఆకట్టుకుంది. రామజోగయ్య శాస్త్రి ఈ పాటకు లిరిక్స్ అందించగా, శిల్పా రావు ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు. ఈ పాటకు యూట్యూబ్‌లో 100ం మిలియన్ వ్యూస్ వచ్చాయి. కాగా, హీరోయిన్లు డీప్‌ఫేక్ బారిన పడడం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ పలు ఇండస్ట్రీలకు చెందిన హీరోయిన్లకు ఇలాంచి ఛేదు అనుభవం ఎదురైంది. మార్ఫింగ్ వీడియోలతో సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్నారు. ఇటీవల 'అర్జున్ రెడ్డి' ఫేమ్ హీరోయిన్ శాలిని పాండే కూడా ఏఐ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఆమెపై అభ్యంతరకరంగా వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వీడియోలపై శాలిని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు వీడియోలను ఎవరు షేర్ చేయొద్దని, డౌన్‌లోడ్ చేయొద్దని కోరారు. అంతకుముందు మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్, రష్మిక మంధన్నా, కత్రినా కైఫ్‌కు కూడా ఇలాంటి ఛేదు అనుభవం ఎదురైంది. ఇలాంటి వాటిపై పలువురు ఇప్పటికే చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

## నేను చాలా అదృష్టవంతుడిని..

టాలీవుడ్ లవ్ బర్డ్స్ రష్మిక మందన్న, విజయ్ దేవరకొండలు తమ సుదీర్ఘ ప్రేమాయణానికి తెరదించి ఈ ఏడాది ఫిబ్రవరిలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఉదయ్‌పూర్‌లో తెలుగు, కొడవ సాంప్రదాయాల ప్రకారం వీరి వివాహం ఘనంగా జరిగింది. పెళ్లి తర్వాత తొలిసారిగా ఈ జంట కలిసి నటిస్తోంది. అదే రణబాలి.. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 16న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక- విజయ్ దేవరకొండలు పాల్గొన్నారు. రణబాలి సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేశాం.. అప్పట్లో వరి అన్నం దొరకడమే కష్టంగా ఉండేది. ఆ ఫీల్ తీసుకురావడానికి కొన్ని షాట్స్ కోసం మంచినీరు మాత్రమే తీసుకుని మూడు రోజుల పాటు ఉన్నాం. ఇందుకోసం రోజుకు 6 లీటర్లు మంచినీరు తీసుకునే విధానం నుంచి షూటింగ్ చివరి నాటికి కేవలం ఐస్ క్యూబ్స్‌తో దాహం తీర్చుకున్నా. చివరికి తట్టుకోలేక నా స్టాఫ్‌ని కొబ్బరి నీరు తీసుకురమ్మని చెప్పేవాడిని అని విజయ్ దేవరకొండ ఈ సినిమా షూటింగ్ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఇక మీ పెళ్లి జరిగిన తర్వాత ప్రతి నెలా వన్ మంథ్ యానివర్సరీ సెలబ్రెట్ చేసుకుంటారా అని యాంకర్



అడగ్గా.. దీనికి రష్మిక స్పందిస్తూ విజయ్ అలాంటివి సెలబ్రేట్ చేసుకోరు. కానీ కొంతమంది మాత్రం ఇలాంటి ఇష్టపడతారు. ప్రతి పుట్టినరోజూ ముఖ్యమైనదే, మనం రోజు రోజుకు పెద్దవారిగా అయిపోతున్నాం. ఈ భూమ్మీద ఎంతకాలం ఉంటామో తెలియదు, అందువల్ల సెలబ్రేషన్స్ అనేది ముఖ్యం. చిన్నదైనా పెద్దదైనా సెలబ్రేట్ చేసుకోవాలి.. కనీసం కేక్ అయినా కట్ చేసుకోవాలి అని రష్మిక అభిప్రాయపడ్డారు. దీనికి విజయ్ స్పందిస్తూ.. రష్మిక నా జీవితంలోకి సంబరాలను తీసుకొచ్చింది. ఇప్పుడిప్పుడే హాలిడేస్ ఎంజాయ్ చేస్తున్నాం.. కానీ నా దృష్టిలో ప్రతిరోజూ లేచిన దగ్గరి నుంచి యుద్ధం చేయాల్సిందే అన్నారు. పలు భాషలలో మాట్లాడటం, పనిచేయడం గురించి రష్మికను యాంకర్ ప్రశ్నించగా.. చిన్నప్పుడు నేను తమిళ సినిమాలు చూస్తూ పెరిగాను. అందువల్ల తమిళ్ మాట్లాడం కొంచెం తెలుసు.. మేనేజ్ చేయగలను. కానీ తెలుగు పూర్తిగా కొత్త భాష, కొత్త ఇండస్ట్రీ, పెద్ద పెద్ద డైలాగ్స్ ఇస్తున్నారు. నా అసిస్టెంట్ తెలుగోడు.. ఆయనకి ఏమైనా చెప్పాలంటే నేను ఖచ్చితంగా తెలుగు నేర్చుకోవాలి. ఇండస్ట్రీలో అందరితో తెలుగులో మాట్లాడాలి. కొన్ని పదాలు, వాటి మీనింగ్ నేర్చుకుందామని ట్రై చేశా. ఒకరు తెలుగులో మాట్లాడుతున్నారంటే వాళ్లకి రిప్లయ్ అదే భాషలో ఇవ్వాలని రష్మిక పేర్కొన్నారు. తనకి తమిళ్, కన్నడ, కొడవ, తుళు, తెలుగు, హిందీ మాట్లాడుతుందని విజయ్ ప్రశంసించారు.

## 'ది ప్యారడైజ్' వసూళ్లే సాక్ష్యం..

### - నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

సినిమా రివ్యూలకు, బాక్సాఫీస్ కలెక్షన్లకు ప్రత్యక్ష సంబంధం ఉండదని సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన నాని పీరియడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విజయాన్నే ఇందుకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రానికి మిశ్రమ, నెగెటివ్ రివ్యూలు వచ్చినా వసూళ్లు నిలకడగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమ్మారెడ్డి, "ది ప్యారడైజ్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఒక్క భారత మార్కెట్లోనే రూ.120 కోట్ల వరకు రాబట్టింది. సినిమాను అధిక ధరలకు కొనుగోలు చేసిన బయ్యర్లు ప్రస్తుతం నష్టాల నుంచి బయటపడుతున్నారు. నైజాం ఏరియా డిస్ట్రిబ్యూటర్లు లాభాల్లోకి అడుగుపెట్టారు" అని వివరించారు. "రివ్యూలకు,




వసూళ్లకు సంబంధం లేదని నేను మొదటి నుంచి చెబుతున్నాను. ఒకవేళ నెగెటివ్ రివ్యూల ప్రభావం నిజంగా ఉంటే, సినిమా వసూళ్లు వెంటనే పడిపోవాలి. కానీ ఈ చిత్రం రూ.100 కోట్ల మార్కును దాటి ఇప్పటికీ నిలబడింది" అని తమ్మారెడ్డి వ్యాఖ్యానించారు. సినిమాపై ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారాలు జరిగాయని తాను భావించడం లేదని, కానీ డబ్బులిచ్చి ఒక సినిమాను దెబ్బతీయడం మాత్రం మహా పాపమని ఆయన అన్నారు. ప్రేక్షకుల ఆదరణ ఉన్నప్పుడు విమర్శలు, పైరసీ వంటివి సినిమా విజయాన్ని ఆపలేవని ఆయన అభిప్రాయపడ్డారు.